ENTERED
KSR02B102c

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జనవరి 03, 2016

అల్లు - హాస్యపు జల్లు

నవ్వుల వైద్యులు

అదే బాటలో...?!

పసితనం నుంచి పెద్దలను పరిశీలిస్తూ పెరిగిన చిన్నారులకు... హీరో హీరోయిన్లు మార్గదర్శులు స్ఫూర్తిప్రదాతలు అన్నీ పెద్దలే. అందునా సినీ రంగానికి చెందిన వారి గురించి చెప్పేదేముంది! ఆ రంగుల ప్రపంచం ఎవర్నైనా సరే ఇట్టే ఆకట్టుకుంటుంది. మీ ఎదురుగా కనిపిస్తున్న టీనేజర్ల చూపూ, మాటా, అడుగూ అటూఇటూగా బాలీవుడ్‌వైపే పడేట్టున్నాయి. బాలనటిగా కెరీర్ ప్రారంభించి బాలీవుడ్‌ను ఏలిన శ్రీదేవి-నిర్మాత బోనీకపూర్ కూతురు జాహ్నవి తల్లి అడుగుజాడల్లోనే పయనించేలా వుంది. ఇప్పటికే ఈ తల్లీకూతుళ్లు ఎక్కడ మెరిస్తే అక్కడ మీడియా చూపంతా వీరిపైనే. జాహ్నవి అరంగేట్రానికి సంబంధించి బోలెడన్ని కథనాలు ఎప్పటికప్పుడు సరికొత్తగా ప్రచారమౌతూనే వున్నాయి. బాలీవుడ్ బాద్షా షారూక్-గౌరీ ఖాన్ గారాల పట్టి సుహానా ఖాన్‌కు పద్నాలుగేళ్లు. వీలున్నప్పుడల్లా అమ్మానాన్నలతో ఫంక్షన్లకు హాజరౌతూ వుంటుంది. తన కుమార్తె హీరోయిన్ అయితే సంతోషమేనని ఇప్పటికే షారూక్ ప్రకటించేశాడు కనక మార్గం స్పష్టంగానే వుంది. ఆమీర్‌ఖాన్ పదిహేడేళ్ల కూతురు ఇరా ఖాన్‌కు పెయింటింగ్ అంటే ఇష్టం. ఒకవేళ బాలీవుడ్‌ను కెరీర్‌గా ఎంచుకుంటే మాత్రం తెర వెనుకే వుంటుందట. అమితాబ్ బచన్ మనవరాలు నవ్య నవేలి ఈ మధ్య ర్యాంప్ పట్ల ఆసక్తి కనబరుస్తోంది. ర్యాంప్ వాక్ మెల్లగా బాలీవుడ్‌కు దారితీస్తుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు సన్నిహితులు. షారూక్ ఖాన్ - గౌరీ తనయుడు ఆర్యన్ ఖాన్‌ది కూడా నవ్య వయసే. ఇద్దరూ ఒకే స్కూల్లో చదువుకుంటున్నారు. మంచి స్నేహితులు. కెరీర్ ఎంపికలో తనకి పూర్తి స్వేఛ్ఛ వుందన్నది షారూక్ మాట. తన అడుగు ఎటన్నది చెప్పకపోయినా ఇన్‌స్టాగ్రమ్‌లో వందలాది ఫొటోలు పెట్టేసి ఆకట్టుకోవడంలో ఆర్యన్‌ది అందెవేసిన చెయ్యి. సుస్మితాసేన్ పెంపుడు కూతురు రెనీకి పదిహేనేళ్లు. తన తల్లితో కలిసి ర్యాంప్ వాక్‌లకు, టీవీ ఫ్యాషన్ షోలకూ హాజరై... ఇప్పటికే కెమెరాకళ్లను ఆకట్టుకుంటోంది. ఆమె బాటలోనే అందాల రాణి కిరీటాన్ని తిరిగి సంపాదించాలన్నది రెనీ ఆశ. సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం ... యువకుడిగా వున్నప్పుడు తన తండ్రి ఎలా వుండేవాడో అచ్చంగా అలాగే వున్నాడు. పటౌడీ వారసుడిగా క్రికెట్-సినిమా రంగాల్లో దేన్ని ఎంచుకుంటాడో చూడాలి. ★

రెనీ-సుస్మిత


శ్వేత-నవ్య నవేలి

సైఫ్ అలీ- ఇబ్రహీం

శ్రీదేవి-జాహ్నవి

సుహానా, ఆర్యన్‌తో షారుక్ గౌరి

అమీర్- ఇరా

KSR02B102

ENTERED

స్నేహ ప్రజాశక్తి

snehaweekly.praja@gmail.com

ఏం మారింది!



◆ మనలో మాట

ఓహ్...! అప్పుడే కొత్త సంవత్సరం వచ్చేసి మూడు రోజులైంది. నిజానికి... నేస్తాలు చెప్పిన నూతన సంవత్సర శుభాకాంక్షలు .....ఇంకా చెవుల్లో మార్మోగుతూనే వున్నాయి. మిత్రులు తినిపించిన కేకు తాలూకు తీపి ... నాలుకపై పల్చగా తగులుతూనే వుంది. ఆరోజు అర్ధరాత్రి చేసుకొన్న పార్టీలు, డాన్సులు, సంగీతం, పాటల హోరు మరువనే లేదు.

సంతోషంగా గడిపిన కాలాన్ని గుర్తుంచుకోవడం మంచిది కూడా. ఉత్సాహంగా పని చేయడానికి ఇంధనంగా పనికొస్తుంది.

కాకపోతే ఇక్కడో చిన్న సందేహం. ఈ సంబరాలన్నీ నూతన సంవత్సరం వచ్చిందన్న ఆనందంలో చేసుకున్నవే కదా. ఈ సందర్భంగా మనలో కానీ, మన చుట్టూ కానీ, మన జీవన గమనంలో కానీ ఏం మార్పు వచ్చిందీ? తెచ్చిందీ?

సంవత్సరం మారింది. క్యాలెండర్ మారింది. తారీకులు మారుతున్నాయి. రోజులు భారంగా దొర్లిపోతున్నాయి. అంతకు మించి ఏం మారింది?

అదే ఉద్యోగం. అదే వ్యవసాయం. అదే కూలి పని. అదే ఇరుకు అద్దె ఇల్లు. అవే అప్పులు. అద్దెలు. అవే స్కూలు ఫీజులు. ఆస్పత్రి ఖర్చులు. అవే ఇబ్బందులు. సబ్బందులు.

చేసే పనికీ.. చేతికందే జీతానికీ... ఖర్చులకూ...పొంతన లేక అల్లాడుతున్న అంగన్‌వాడీలు, ఆశాలు పోరాడుతూనే వున్నారు.

పెద్దలకు అప్పగించడానికి పచ్చటి భూములు లాక్కోవద్దంటూ రైతులు మొర పెట్టుకుంటూనే వున్నారు. ఫ్యాక్టరీల సాకుతో వేలాది ఎకరాలు గుంజుకోవద్దంటూ కర్షకులు వేడుకుంటూనే వున్నారు.

ఖర్చు తగ్గింపు నెపంతో ఉద్యోగాల కోత కొయ్యొద్దంటూ కార్మికులు అభ్యర్థిస్తూనే వున్నారు.

నింగికెగసిన నిత్యావసర వస్తువులను నేల మీదకు తీసుకురమ్మని బతిమాలుకుంటూనే వున్నారు సామాన్య ప్రజలు. ఉప్పు పప్పులు ఉల్లిపాయలు భయపెడుతున్నా ... మేమున్నామంటూ అడపా దడపా కూరగాయలు వణికిస్తున్నా... మొండిగా బతుకుబండి లాక్కొస్తూనే వున్నారు.

ఇవేవీ మారకుండా... వీటిలో మార్పు లేకుండా... మార్పు చేయకుండా...ఒక్క సంవత్సరం మారితే సరిపోతుందా!

సామాన్యుల బతుకులు మారాలన్నా...వారి సౌకర్యాలు మెరుగు పడాలన్నా... నేతలు మారాలి. వ్యవస్థ మారాలి. ■

టపా

కంట తడి పెట్టించిన లక్ష్మి

సిరియా శరణార్థి అబ్దుల్ లెబనాన్ పెన్నులమ్మి తన కుటుంబాన్ని పోషిస్తూ తనలాంటి శరణార్థుల కోసం పాటుపడటం గొప్ప విషయం. యాసిడ్ బాధితురాలు లక్ష్మి సాధించిన విజయం అద్భుతం. డయ్యూలో ఏటా జరిగే బీచ్ ఫెస్టివల్ మొత్తం సందడిగా, ఆసక్తిని కలిగించింది. రాజస్థాన్ వేల గ్రామాల్లో మోడు బారుతున్న బాలికలకి మెరుగైన జీవితాన్ని ప్రసాదిస్తున్న 'వీర్నీ' సంక్షేమ సేవలు కొనియాడదగినవి. హాలీవుడ్ నటుడు కబీర్ బేడి ఇంటర్వ్యూలో చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాం.

టి. సత్యనారాయణ మూర్తి, మల్కాపురం, విశాఖ

కదిలించిన తండ్రి ఆవేదన

అంతర్యుద్ధం సిరియాను మారణహోమంలా మార్చేస్తే నిస్సహాయులైన ఆ దేశ ప్రజలు ప్రాణాలకు తెగించి, పొరుగు దేశాలకు వలస వస్తున్నారు. బతుకు దెరువు కోసం నిద్రిస్తున్న తన కుమార్తెను భుజంపై వేసుకుని... మండే ఎండలో నాలుగు డబ్బుల కోసం పెన్నులు అమ్ముతున్న ఓ తండ్రి ఆవేదన మనసును కదిలించి వేసింది. తోటి శరణార్థులను ఆదుకోవడం తనలోని దాతృత్వాన్ని చాటి చెబుతుంది. కబీర్ బేడీ గురించి చాలా విషయాలను తెలుసుకున్నాం.

రాము, కడప

వీర్నీ మార్పు

రాజస్థాన్‌లోని ఓ గ్రామాన్ని సందర్శించిన వీర్నీ అక్కడి స్త్రీల పట్ల జరుగుతున్న వివక్షను చూసి వారిని మార్చాలని నిర్ణయించుకుంది. సమాజం ఎంతో ముందుకు పోతుంది అని చెబుతున్న వారికి ఈ గ్రామాలు అగుపించవు, ఇటువంటి గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే భారతదేశం అభివృద్ధి పథంలో సాగుతుంది. యాసిడ్ బాధితురాలు లక్ష్మి లాంటి వారికి నిజ జీవితంలో తోడు, కాస్తంత మద్దతు లభిస్తే వారు కూడా సభ్య సమాజంలో తలెత్తుకుని జీవించగలరని ఈ వ్యాసం ద్వారా తెలిపిన రచయితకు ధన్యవాదాలు.

దొరబాబు, మాడుగుల్ల, విశాఖ

రైతే బంగారం

కాకి బంగారం కథ ఓ చిన్నారి హృదయాన్ని ఆవిష్కరించింది. సమాజంలో రైతు విలువ ఎంతటిదో చాలా బాగా వివరించింది. వస్తు వ్యామోహంలో పడి కొట్టుకుపోతున్న వారు కేవలం ఆహార్యం చూసి ఎదుటివారికి విలువ కట్టే దిగుజారుడుతనం నుంచి బయటపడాలని రచయిత సూటిగా చెప్పడం బాగుంది. ఈ వారం కార్టూన్లు చాలా బాగున్నాయి. 2015లో సెలబ్రెటీలకు చాలా వరకు ఆడపిల్లలే పుట్టారనే విషయాన్ని గుర్తించి ఇవ్వడం బాగుంది. అంతర్యుద్ధం సిరియాను అల్లకోలం చేస్తూ ఉంటే మరోవైపు శరణార్థులు తమ వారిని కాపుడుకునేందుకు నానా కష్టాలు పడుతూ జీవిస్తున్నారు. ఓ తండ్రి ఆవేదనను 'కలం కడుపు నింపింది'లో చాలా చక్కగా వివరించారు. వీర్నీ లాంటి మహిళలు మరెందరో రావాలని ఆశిస్తున్నాను. బొమ్మలకు కూడా ప్రాణాలుంటాయని మరీనా మరోసారి తెలియజేసారు.

అమల, కర్నూలు

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

నవ్వుల వైద్యులు

కవర్ స్టోరీ ———— 6

తెల్ల గౌన్ కాస్త రంగుల్ని చల్లుకుని క్లౌన్ గౌన్ అయిపోతే. స్టెత్ కాస్త మేజిక్ టూల్‌గా మారిపోతే. సీరియస్ మోములు కాస్త ఫన్నీ ఫేస్ పెట్టేస్తే. పెన్ ముక్కున పెట్టి ఆలోచించే బదులు ముక్కుకు ఓ ఎర్రటి బుడగ తగిలిస్తే.. వారే క్లౌన్ డాక్టర్లు. సంతోషాల ఇంజెక్షన్లు, నవ్వుల గొట్టాలు మందు వేసి రోగాన్ని త్వరగా తరిమేసేందుకు వైద్యులతో పాటు గ్లౌజులు తొడుగుతారు. ఆటపాటల్లో, ట్రిక్కులు, పీట్లతో చిన్నారుల్ని కేరింతలు కొట్టిస్తూ ఆస్పత్రి అంటే అమ్మో అనే భయాన్ని మాయం చేస్తారు. హ్యూమరోపతీతో, నవ్వుల థెరపీతో మనసును కుదుట పరుస్తారు, చికిత్సను తేలిక చేస్తారు.

స్ఫూర్తి 3
సముద్ర మహిళ

జీవితం 4
ఓ అమీరా కథ

కార్టూన్ పంచ్ 5

నవ్వుల్-పువ్వుల్ 10

వింతలోకం 11
'అంటరాని' గోడ

చూద్దామా 12
అద్దమంటి మసీద్

సినిమా కబుర్లు 14
అల్లు - హాస్యపు జల్లు

విశేషం 17
నడిచే ఈత చెట్లు

కథ 18
వర్ణ చిత్రం

రుచి 21
పాప్డి చాట్

బాల నేస్తాలు 22
హమ్మింగ్ రెక్కల పురుగు

కొత్త పుస్తకాలు 24
నల్ల చేపపిల్ల కథ

స్టార్ -16
'దుర్వ్యసనం కళలను సృజించలేదు'

ఎఆర్ రెహ్మాన్

వీరిని చూసే సాగరకన్యలని భ్రమించి ఉంటారు ప్రాచీన నావికులు. గడ్డకట్టించే చలిలో సముద్రంలో గంటల పాటు ఈదులాడటం మనిషికి సాధ్యం కాదనే ఉద్దేశమేమో. కొరియా జలకన్యలుగా పిలవబడే హాన్యో మహిళలు సముద్ర లోతుల్లో ఫ్రీ డైవ్ చేస్తూ ముత్యాలనేరుతారు. సముద్ర ఆహారాన్ని సేకరిస్తారు. 80 ఏళ్ల వయస్సులో కూడా!!



సముద్ర మహిళ

హాన్యో అంటే సముద్ర మహిళలని అర్థం. నిజంగా వీరు సముద్రానికి చెందిన వారే. ప్రపంచంలోనే అతి ధృఢమైన, నైపుణ్యం గల ఫ్రీ డైవర్లుగా వీరిని పిలుస్తారు. సుమారు 20-30 మీటర్ల లోతున ఉన్న సముద్ర ఆహారం, ముత్యాలను వీరు సేకరిస్తారు. అది కూడా స్కూబా గేర్లు లేకుండా. ఈ మధ్య ఫేస్ మాస్క్, వెట్ స్యూట్లు వేసుకుంటున్నారు. ఆక్సిజన్ ట్యాంకులన్న మాటే లేదు. ఎక్కువగా వేటాడటం వల్ల ఆహార వనరు తగ్గుతుందన్న కారణంగా నిషేధం పాటిస్తారు. వేటలో పురుషులను ఎప్పుడో వెనక్కు నెట్టేశారు. వీరు ఎంతగా ఈ విద్యలో ఆరితేరినవారంటే తొమ్మిది నెలల నిండు గర్భిణులుగా ఉన్నా కూడా సేకరణకు వెళ్లిపోతుంటారు కొందరు. వేట పడవల్లోనే ప్రసవాలు జరిగిన సందర్భాలున్నాయి. ఆరేడు దశాబ్దాల నుంచి డైవింగ్ చేస్తున్న అనుభవజ్ఞులే ఎక్కువ మంది. అయితే కొన్ని తరాల నుంచి హాన్యోల కుటుంబాల ఆడపిల్లలు పైచదువులకు నగరాలు వలసపోతున్నారు. ఒకప్పుడు 30 వేల నుంచి 60 వేల మంది వరకు హాన్యోలు ఉండగా ఇప్పుడు వారి సంఖ్య 5000లకు పరిమితమైంది. రానున్న 20-30 ఏళ్లలో పూర్తిగా వీరి వేట కనుమరుగయ్యే అవకాశం ఉంది. ప్రాణాలతో చెలగాటమైన వీరి సముద్ర వేటలోకి తమ కూతుళ్లను దింపడానికి చాలా మంది మొగ్గు చూపడం లేదు.

ఆడపిల్లే ముద్దు

డైవింగ్‌లో మగవారిని వెనక్కు నెట్టేసి మాతృస్వామ్య వ్యవస్థకు ఊత నేర్పిన హాన్యోలను కొరియాలో లెజెండ్స్‌గా చూస్తారు. బలమైన పితృస్వామ్య వ్యవస్థ ఉన్న ఆ దేశంలో కేవలం వీరి ఉనికి ఉన్న జేజు, యూడో ద్వీపాల్లో మాత్రమే స్త్రీకి తిరుగులేని ఆధిపత్యం కనిపిస్తుంది. మగ బిడ్డ జననం కన్నా ఆడ బిడ్డ పుట్టుకనే ఘనంగా వేడుక చేసుకుంటారు. మగవారు కట్నం ఇచ్చుకుని వివాహాలు చేసుకుంటారు. కేవలం సముద్ర జలాల్లోనే కాదు వ్యవసాయంలోను హాన్యోలు చెమటోడుస్తారు. అలా తీరిక లేకుండా ఆదాయ వేటలో ఉండటం వల్ల మిగతా ప్రాంతాల వారు కూడా వీరిని బాగా గౌరవిస్తారు. ముఖ్యంగా మారా దీవిలో అయితే మగాళ్లు కేవలం పిల్లల్ని చూసుకోవడం, ఇంటిని చక్కబెట్టుకోవడం, షాపింగ్‌లు చేయడానికే పరిమితమౌతారు. తొలుత కేవలం మగ వారికి మాత్రమే తెలిసిన విద్య ఇది. కానీ కొరియా రాజు అధిక పన్నులు వసూలు చేయడంతో పాటు యుద్ధాలు, సంఘర్షణల వల్ల ఎక్కువ మంది పురుషులు సైనికులుగా మారిపోవడంతో రాజుకు కప్పం కట్టాల్సిన సీ వీడ్‌ను మహిళలే సేకరించడం మొదలెట్టారు. అయితే వందలాది ఏళ్ల నుంచి భర్తలతో కలిసి సీ వీడ్‌ను సేకరించిన చరిత్ర ఉంది. మహిళల శరీర నిర్మాణం కూడా డైవింగ్‌కు అనుకూలంగా ఉండటంతో కొన్నేళ్లలోనే పురుషులను తోసిరాజన్నారు. వారు ఎంతగా ఫ్రీ డైవ్‌లకు అనుకూలమైపోయారంటే ఎనభై ఏళ్లు దాటిన వారు కూడా చాలా చురుగ్గా సముద్ర అంతర్భాగాన్ని శోధిస్తుంటారు. సీ వీడ్‌తో పాటు, షెల్ ఫిష్, పీతలు, ఆక్టోపస్, సీ అర్చిన్స్, ఆయిస్టర్‌లకు భారీ డిమాండ్‌తో పాటు ఖరీదు ఉండటంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. కొరియా ప్రభుత్వం పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంతో రెస్టారెంట్‌లు, వసతి గృహాలను కూడా మహిళలే నిర్వహించడం మొదలుపెట్టారు. ఇలా జేజు ఆర్థిక రంగంలో 60 శాతం హాన్యోలదే వాటా. సుమారు 40 శాతం పురుషులకు ఆదాయమంటూ ఏదీ లేదు.

తీరిక లేని వేట

నీటిలో తేలే తెవాక్ అనే బొయ్‌కు తాడుతో వల బుట్టను కట్టి నీటిలోకి దిగుతారు. నడుముకు 8 కేజీల బరువుండే లోహ బెల్టును ధరిస్తారు. సీ వీడ్‌ను తెంచేందుకు ఎల్ ఆకారంలో ఉండే కత్తి ఉంటుంది. మూడు నిమిషాలకు పైగా వేట కొనసాగించి పైకి వస్తారు. నిమిషంలోపే మళ్లీ మరో డైవ్‌కు చేరిపోతారు. సేకరించిన ఆహారాన్ని వల బుట్టల్లో నింపుతారు. ఇలా వేసవిలో 4 గంటల పాటు చలికాలంలో వివిధ బ్రేకుల్లో 3-4 గంటలపాటు డైవింగ్ చేసేవారు. వెట్ స్యూట్‌ల వాడకంతో ఇప్పుడు ఏ కాలంలోనైనా ఆరు గంటలపాటు వేట కొనసాగిస్తున్నారు. రోజుకు 110 కేజీల సీ వీడ్‌ను సేకరిస్తారు. ఒక్కో కేజీ ఒక్కో డాలర్ ఖరీదు చేస్తుంది. అప్పుడప్పుడు ఆయిస్టర్లలలో ముత్యాలు లభ్యమవుతాయి. 8-9 ఏళ్ల వయసు వచ్చేనాటికి ఆడపిల్లలకు శిక్షణ మొదలవుతుంది. కఠోరంగా ఉండే శిక్షణను ఏడేళ్లపాటు పొందిన తర్వాతే పూర్తిస్థాయి హాన్యోగా గుర్తిస్తారు. అప్పుడే వేటకు అనుమతిస్తారు. ఇప్పుడున్న వృద్ధుల్లో చాలా మంది 15 ఏళ్ల వయసు నుంచే వేట మొదలెట్టిన వారున్నారు. కొందరికి 70 ఏళ్లకు పైబడి అనుభవం ఉంది. యువతులు, నడి వయసు వారి కన్నా వృద్ధులే చాలా చలాకీగా ఫ్రీ డైవ్‌లు చేస్తుంటారు. ఆటుపోట్లకు అనుగుణంగా చిన్నపాటి శరీర కదలికలతో వారు ఈదుతుంటే ఏదో సింక్రనైజ్ స్విమ్మింగ్ షోను చూస్తున్నట్టు అనిపిస్తుంది. జట్లు జట్లుగా వీరి వేట సాగుతుంది. ఆక్సిజన్ అంతా అయిపోయి బ్లాక్ ఔట్ అయ్యే అనుభూతి వీరికి సర్వసాధారణం. ఏడాదిలో 9 మంది ప్రాణాలు ఇలా కోల్పోతుంటారు. ఊపిరి తిత్తుల్లో పోగుబడిన కార్బన్ డై ఆక్సైడ్‌ను వెంటనే విడుదల చేసేందుకు వీరు విజిల్‌లా గాలిని వదులుతారు. డైవ్ నుంచి పైకి తేలగానే విచిత్రమైన అరుపులతో శరీరాన్ని సమన్వయం చేసుకుంటారు. వారి షామన్ సంప్రదాయాల ప్రకారం సముద్ర దేవతకు ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తారు. ✦



ముచ్చటైన ఓ సిరియా కొత్త పెళ్లి జంట. పంచుకోబోయే జీవితంపై ఎన్నో ఆశలు, ఎన్నెన్నో కలలు. ఒకరంటే ఒకరికి ప్రాణమిచ్చేంత ప్రేమ. ఇంతలో యుద్ధం. చెప్పుకున్న ఊసులు, చేసుకున్న బాసల్లో మాటిచ్చిన అందమైన జీవితం మరి దక్కుతుందా? ఒకరి ప్రాణాల్ని ఒకరు కాపాడుకునేందుకు చేసిన వేల మైళ్ల చావు బతుకుల నడకే వారికి హనీమూన్ అయ్యింది. వారి రెండు ప్రాణాలు ఒకటేనంటూ మూడో ప్రాణం అంకురించింది. వీరికంటూ ఓ అందమైన జీవితం కచ్చితంగా ఉందని ఓ ఆస్ట్రియన్ దిల్వాలే చాటాడు. సిరియా యుద్ధ సమీరాన వెలుగు చూసిన ఓ అమీరా కథ ఇది.

ఓ అమీరా కథ

అమ్మాయి పేరు అమీరా. అబ్బాయి పేరు సయాద్. అప్పుడే వివాహమైంది. తనకిష్టమైన మిఠాయి కొని తెమ్మని సయాద్‌కు మురిపెంగా చెప్పింది అమీరా. ఆ బంగారు బొమ్మ ముచ్చట తీర్చేందుకు సయాద్ ఉత్సాహంగా మార్కెట్‌కు బయలుదేరాడు. కళ్లెదుటే పెద్ద పేలుడు. భారీ విధ్వంసం. రక్త మాంసాల్లో తడిసి ముద్దయిన ప్రాంతం. సయాద్‌కు సొంతూరులో బాంబుల మోత కొత్తేం కాదు. అలాంటివెన్నింటినో కొన్నేళ్లు గా చూస్తునే ఉన్నాడు. చూసి చూసి గుండెప్పుడో మొద్దుబారిపోయింది. బాధెప్పుడో నెగళ్లు వేసింది. చలించిపోవడమన్న భావన ఆవిరే మిగిలుంది. కానీ ఈ సారి ఆ ఆవిరి వర్షమైంది. అమీరా కళ్లల్లో మెదిలే సరికి పెను తుఫానైంది. క్షణమొక గండమైన ఆ జీవన పోరాటంలో అమీరా ఎదురుచూపుల్లోని తీవ్రత సయాద్‌కు బాగా తెలుసు. అంతా కమ్మేసిన పొగ, దుమ్ము దుమారాల్ని చీల్చుకుంటూ అమీరా నవ్వుల్ని గుర్తుచేసుకుంటూ బలం పుంజుకుని ఇంటికి పరుగు తీశాడు. కొన్ని రోజుల్లోనే వలస బతుకుకు ప్రయాణం సిద్ధం చేశాడు. లక్షలాది సిరియన్లలో ఈ జంట బతుకు పోరాటం ఓ లెక్క కాదు. అసలు బంధాలు, ప్రేమలు అనుభూతి చెందడానికి వారి ప్రాణాలే లెక్కలో లేవు. నడక ఎక్కడకు వారి బతుకుల్ని చేర్చుతుందో తెలీదు. కానీ ఒకరి ప్రాణాలు ఒకరికి ముఖ్యం. ఒక్కరు ప్రాణాలతో మిగిలినా వారి ప్రేమ, బంధం మిగులుతుందనే ఆశ. ఆ ఆశే ఆకలిదప్పుల్ని జయించింది. ముళ్ల కంచెల్ని మరుల్ని చేసింది. నిలువు కాళ్లపై నిద్రల్ని అందమైన స్వప్నాలు చేసింది. ఏకబిగి సుదూర నడకల్ని ముచ్చట్లు చెప్పుకునే ఏకాంతాల్ని చేసింది. టర్కీ, బల్గేరియా దాటేశారు. సెర్బియాలోకి ప్రవేశిస్తే బాల్కన్‌లోకి పడినట్టే. మాటిచ్చుకున్న అందమైన జీవితం అందుతుందని మురిపించింది. ఈ జంట పోరాటాన్ని మేసిడోనియా నుంచి ఫాలో అయ్యిందో మీడియా. ఎంత దూరం ఈ ప్రయాణం సాగుతుంది, ఎంత దగ్గరకు ఈ పోరాటం చేరువచేస్తుందనే దానిపై ఈ దంపతులకు ఉన్నంత నమ్మకం ఇసుమంతైనా లేదు వారి కథ తెలిసిన ప్రతి ఒక్కరికి. శరణార్థి శిబిరాల్లో అంతమౌతున్న జంటల్లో వీరిదో పేరు అనుకున్నారు. వారు ఊహించినట్టే సెర్బియాలోకి అనుమతి కష్టమైంది. ఎంత వేడుకున్నా సరిహద్దు దళాలు అడ్డుపడ్డాయి. కనీసం అమీరానైనా హద్దు దాటిస్తే ఓ కొత్త జీవితం అందుతుందని సయాద్ ఆలోచించాడు. ఆమె ఒక్కర్తెనైనా వదులుతారని బలవంతంగానే చేయి విడిచాడు. కానీ అమీరాకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. సయాద్‌ను అక్కడ విడిపోతే తిరిగి చూస్తుందన్న నమ్మకం ఆమెకు లేదు. మరేం చేయాలి. అమీరా గర్భవతి అని అబద్ధం చెప్పి కాళ్లవేళ్లా ప్రాథేయపడి ఎలాగోలా సెర్బియాలోకి ప్రవేశించారు. ఆ అబద్ధమే నిజమైంది. శరణార్థి శిబిరంలోని హెల్త్ చెకప్‌లో విషయం తెలిసింది. నాలుగు నెలల ఎడతెగని నడకలో చాలా రోజులుగా స్నానం కాదు గదా ముఖం కడిగి ఎరుగరు వారు. అమీరా గర్భవతి అన్న విషయం కూడా కలిసి వేల వార్తల్లో ఒకటిగా శిబిరం దాటింది. ఓ సేవా సంస్థ ద్వారా వీరి కథ ఆస్ట్రియాలో అత్యంత ధనికుల్లో ఒకరైన యుల్రిచ్ వాన్ సాస్‌కు చేరింది. అతడికీ వలస జీవిత నేపథ్యముంది. ఎస్తోనియా నుంచి ప్రాణాలు అరచేతబెట్టుకుని ఆస్ట్రియాకు కుటుంబంతో వచ్చిన జర్మన్ సంపన్నుడు ఆయన. గతం గుండెల్ని పిండేసింది. ముక్కుపచ్చలారని వీరి నవజీవితంపై ఆందోళన నిద్ర చెదరగొట్టింది. ఏ క్షణంలో ఆ అందమైన జంట తలపు వస్తుందో తెలీదు. అలా రోజులు గడిచిపోయాయి. ఇంతలో హంగేరీ మీదుగా ఆస్ట్రియాలోకి ప్రవేశించిందా జంట. వారు శరణార్థి శిబిరంలో ఉన్నారన్న విషయం తెలిసి వివిధ స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థల సహకారంతో అమీరా, సయాద్‌లను యుల్రిచ్ కలిశాడు. ఓ గర్భవతి బిడ్డను మోస్తున్న రోజులు ఎలా ఉండకూడదో అంత దారుణమైన దుస్థితిలో అమీరా ఉంది. అన్నాళ్ల నడక, అడ్డగింపులు, ప్రాణ భయం, బెదిరింపులు, అదిలింపులు, యాత్ర మధ్యలోనే ఆకలితో శాశ్వత వీడ్కోలు చెప్పిన ఎందరో తోటి శరణార్థుల ముగింపులు ఆమెకు పీడకలలా మారాయి. అంతా బాగున్నా సీమంతంతో మరింత సంతోషాన్ని కూతురికి సొంతం చేయాలనే తహతహ ఇక్కడి తల్లిదండ్రులది. కానీ రేణువంత ఆశలేని దుర్భర స్థితి అమీరాది. ఎనిమిది మంది పంచుకునే టెంటులో ఆమె నెలలు నిండుతున్నాయి. అందమైన దృశ్యాలు, సంగీతాలు, ఊసులు, ఉత్సాహంతో ఊపిరాడని రోజులుండాలని యుల్రిచ్‌కు తెలుసు. అందుకే ఆ జంట ఊహించని విధంగా వియన్నాలోని తన విలాసవంతమైన కేజిల్‌కు సాదరంగా ఆహ్వానించాడు. అమీరా రాకను సెలబ్రేట్ చేశాడు. తనే వంటకాల్ని చేసి ఆమెకు తండ్రిలా దగ్గరుండి తినిపించాడు. ఖరీదైన విందే కాదు అంతకంటే విలువైన దగ్గరితనాన్ని రుచి చూపించాడు. మేమంతా ఉన్నామంటూ చిరునవ్వుల్ని పూయించాడు. స్కాన్ రిపోర్టుల్ని చూసి సరదాగా పోలికలన్నీ మా అమీరావేనని సయాద్‌ను ఆటపట్టించాడు. తన కుటుంబంతో పాటు కొన్ని రోజులు ఉండాల్సిందిగా కోరాడు. సయాద్‌ను పిలిచి అమీరాకు ఊరంతా తిప్పి చూపించాలని షరతుపెట్టాడు. ఈ ఆతిథ్యం వారి జీవితాల్ని మార్చేసింది. కొత్త జీవితమే కాదు కొత్త ప్రపంచంలో కలిసిపోయేందుకు కొత్త భాషను భార్యకు నింపాదిగా నేర్పిస్తున్నాడు సయాద్. కడుపులో పెరుగుతున్న బిడ్డ కూడా అమ్మ పలుకుల్ని జాగ్రత్తగా వింటూ కొత్త పలకరింపులకు సిద్ధమవుతోంది. ఇప్పుడా జంట అందమైన జీవితం గురించి మళ్లీ ఊసులు చెప్పుకుంటోంది. బాసలు చేసుకుంటోంది. ✦

అయ్యో! పొరపాటున ఇండియాలోనే దిగారయ్యా!
సడన్‌గా కరాచీలో దిగిన మోడీ
గంగాధర్


మధ్యలో.. కాసేపు డ్రైవింగ్ చెయ్యాలి మరి!
కండక్టర్ పోస్టులకు కత్తెర


ఇప్పటికైనా.. నన్ను నిక్కరు మానేయమంటావా! పేడా!!
ఇక రైళ్లో అరటికెట్ లేనట్టే

కార్టూన్ పంచ్


బహుళజాతి కంపెనీలు
అతిథికి ఈమాత్రం వడ్డించకపోతే ఎట్లా!!
మాస్టర్ ప్లాన్

తెల్ల గౌన్ కాస్త రంగుల్ని చల్లుకుని క్లౌన్ గౌన్ అయిపోతే. స్టెత్ కాస్త మేజిక్ టూల్‌గా మారిపోతే. సీరియస్ మొములు కాస్త ఫన్నీ ఫేస్ పెట్టేస్తే. పెన్ ముక్కున పెట్టి ఆలోచించే బదులు ముక్కుకు ఓ ఎర్రటి బుడగ తగిలిస్తే.. వారే క్లౌన్ డాక్టర్లు. సంతోషాల ఇంజెక్షన్లు, నవ్వుల బిళ్లలు మందు వేసి రోగాన్ని త్వరగా తరిమేసేందుకు వైద్యులతో పాటు గ్లౌజులు తొడుగుతారు. ఆటపాటల్లో, ట్రిక్కులు, ఫీట్లతో చిన్నారుల్ని కేరింతలు కొట్టిస్తూ ఆస్పత్రి అంటే అమ్మో అనే భయాన్ని మాయం చేస్తారు. హ్యూమరోపతీతో, నవ్వుల థెరపీతో మనసును కుదుట పరుస్తారు. చికిత్సను తేలిక చేస్తారు.

నవ్వుల వైద్యులు

సూది మందు ఎంత సున్నితంగా చేసినా మరో యాంపిల్ మూత తీయగానే పెద్దోళ్లకు కూడా నొప్పి మనసులో ఏ మూలనో గుచ్చేస్తుంది. చాలా మంది సూది మందు భయంతోనే ఆస్పత్రి అంటే ఆమడ దూరంలో ఉంటారు. ఎంత జ్వరంతో ఒళ్లు కాగిపోతున్నా, తల అదిరి పడుతున్నా ఇంటి కషాయాలనో, ఒంటికి తడి గుడ్డలనో వేసుకుంటారు గానీ మంచం దిగరు. ఇక పిల్లకాయల పరిస్థితేమిటో ఊహించండి. అందుకే అమ్మ గట్టిగా హత్తుకుంటే నాన్న నానా తిప్పలు పడుతూ కోతి చేష్టలు చేస్తూ సూది గండాన్ని గట్టెక్కించడం ఆస్పత్రుల్లో నిత్యం కనిపించే ఓ సీన్. పిల్లలకు ఆస్పత్రులంటే కొన్ని కొండ గుర్తులుంటాయి. తెల్లని వస్త్రాలతో దేవ దూతల్లా కాకుండా మరోలా కనిపిస్తారు నర్సులు, వైద్యులు. తన లాంటి మరెందరో బాధితులు అక్కడ సూది మందు శిక్ష వేయించుకోవడానికి క్యూ కట్టి కనిపిస్తారు బుజ్జాయిలకి. కొందరేమో బెడ్‌కు కట్టేసి మరీ పొడిపించుకుంటున్న జీవిత ఖైదీల్లా అనిపిస్తారు ఆ చిట్టి ప్రాణులకు. తల్లిదండ్రులు కనికరం లేకుండా ఏదో కారాగారానికి బలవంతంగా లాక్కెళుతున్నట్టు వారి కాళ్లకు అడ్డం పడిపోతారు. ఆస్పత్రి పరిసరాలు, తోటి చిన్నారుల ఏడుపులు, పెడ బొబ్బలు హార్ట్ బీట్‌ను అమాంతం పెంచేస్తాయి. స్టెత్ పెట్టి చూస్తే గుండెలు డబడబా కొట్టేసుకుంటాయి. మరి మందు వేసేదెలా. అందుకు మేమున్నాం కదా అంటూ ముందుకు వచ్చేశారు క్లౌన్ డాక్టర్లు. అదేనండీ! హాస్పిటల్ జోకర్లు! వీరు నిజానికి వైద్యులు కాదు. కానీ గెటప్, సెటప్ అలా కనిపిస్తుందంతే. వీరు ఇంజక్షన్లు చేయరు. మందులు రాయరు. కేవలం ఆస్పత్రుల్లో తమ ట్రిక్కులతో చిన్నారుల్ని ఆకట్టుకుని వైట్‌గౌన్ సిండ్రోమ్ (అదే వైద్యుల ఆహార్యం చూసి జడుసుకునే రకం) నుంచి బయట పడేస్తారు. బుడగలతో బుడతల భయాలు ఎగరగొట్టేస్తారు. జగ్లింగ్‌లతో చిన్నారుల అనుమానాల్ని తిరగ్గొట్టేస్తారు. మేజిక్ ట్రిక్కులతో నొప్పిని మాయం చేస్తారు. ఒక్క చిన్నారులకే కాదు. పెద్దలకు కూడా నవ్వుల మందు 100 శాతం పని చేస్తుంది. విదేశాల్లో ఇప్పుడు క్లౌన్ డాక్టర్ల చికిత్సకు విశేష స్పందన ఉంది. బర్న్ వార్డుల్లో కేరింతలు కొట్టిస్తోంది. క్యాన్సర్ పాల్లీవేటివ్ సెంటర్లను నవ్వుల పార్లర్లను చేస్తోంది. ఓ పాజిటివ్ ఎమోషన్‌ను

- అజయ్ కుమార్ వారాల
9502395077

చేకూర్చి అంతా బానే ఉందనే సంతోషాన్ని కలిగిస్తుంది.

కిలకిలలు గలగలలుగా...

మేజిక్, తోలుబొమ్మలాట, వెంట్రిక్విలాజిమ్, మిమిక్రీ, జగ్లరీ, ఆటలు, పాటలు, సర్కస్ ఫీట్లు, బుడగ బొమ్మలు వంటివే క్లౌన్ డాక్టర్ల మందులు, మాకులు. తమ చేష్టలతో, ఫీట్లతో చిన్నారులకు నవ్వు తెప్పించి ఆ సందట్లో సూది మందు నొప్పి తెలియకుండా చూస్తారు. చాక్లెట్లు చప్పరించినట్టు మందు గొట్టాలు మింగేలా చేస్తారు. ఇక టానిక్కుల్ని గటగటతాగేస్తున్నట్టు ఫోజులు కొట్టి చిట్టితల్లుల నోట ఓ మూత మందు గొంతు దిగడం తేలిక చేస్తారు. ఎవరి మనోభావాలు దెబ్బ తినకుండానే వ్యంగ్యంగా నవ్వుల పూలు పూయిస్తారు. మిగతా క్లౌన్‌లకు వీరికి ప్రధాన తేడా అదే. రోగుల మానసిక స్థితిని అర్థం చేసుకుని వారికి ఇబ్బంది కలిగించని అంశాలనే నవ్వులు పేల్చేందుకు ఉపయోగిస్తారు. ఆస్పత్రిలో ఉండాల్సిన పరిశుభ్రత పాడవకుండా,

మిగతావారు డిస్టర్బ్ అవకుండా చాలా జాగ్రత్తలే తీసుకుంటారు. ఆస్పత్రి పరికరాలను దృష్టిలో పెట్టుకుని వీరి ఫీట్లు సాగిపోతాయి. వీరికి శిక్షణనిచ్చేందుకు కొన్ని సంస్థలు కూడా ఉన్నాయి. విదేశాల్లో దీన్ని ఓ కెరీర్‌గా ఎంచుకుంటున్నారు. కేవలం క్లౌన్ డాక్టర్ కోర్సు మీదే ఇస్రాయెల్ డిగ్రీని అందిస్తోంది. అర్జెంటీనాలో ప్రతి ఏటా వందలాది మంది క్లౌన్ డాక్టర్లు సమావేశమవుతారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో వీరు షరా మామూలే. అమెరికా, యూరోప్ దేశాల్లో క్లౌన్ డాక్టర్లను ప్రత్యేకంగా నియోగించుకుంటున్న ఆస్పత్రులు చాలానే ఉన్నాయి. 13వ శతాబ్ది నుంచే ఈ తరహా ఏర్పాట్లు ఉన్నాయని కొందరి మాట. కానీ విస్తృతంగా వైద్యరంగంలో చక్కర్లు కొట్టింది మాత్రం నోర్మన్ కజిన్స్ ద్వారా. 'శాటర్ డే రివ్యూ' పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తున్న కజిన్స్ 1970ల్లో తీవ్రమైన యాంకిలైజ్ స్పాండిలైటిస్ అనే సమస్యతో బాధపడ్డాడు. నొప్పి నుంచి ఉపశమనం కోసం చాలా ప్రయత్నాలు చేశాడు. కానీ ఏవీ ఫలితం ఇవ్వలేదు. ఓసారి క్లౌన్‌ల ప్రదర్శనని తిలకించిన సందర్భంలో నొప్పి జాడ తెలియలేదు. ఈ విషయాన్ని పసిగట్టిన ఆయన ఇక నవ్వుల్ని వదల్లేదు. అలా కొంతకాలానికి పూర్తిగా కోలుకున్నాక తన అనుభవాన్ని పత్రికలో ప్రచురించారు. దాంతో విశేష ప్రచారం లభించింది. 1993లో ఫ్రెంచ్ సంగీతకారుడు ఆన్టోనిన్ మారైల్, స్పెయిన్‌కు చెందిన క్లౌన్ టోర్టెల్ పాల్టోవాతో కలిసి క్రొయోషియాలోని ఓ శరణార్థి శిబిరాన్ని సందర్శించారు. వారు ఊహించని విధంగా సుమారు 700 మంది చిన్నారులు వారి ప్రదర్శనలకు కేరింతలు కొట్టారు. భయానక పరిస్థితుల్లో అప్పటి వరకు నిర్లిప్తంగా, నిర్వేదంగా గడిపిన వారంతా ఒక్కసారిగా హుషారెత్తిపోయారు. ఈ రంగానికి ఇదో బూస్ట్. న్యూయార్క్‌లో అయితే ఏకంగా 'బిగ్ ఆపిల్ సర్కస్ క్లౌన్ కేర్ యూనిట్ సేవల్ని ఎపుడో 1986లోనే మొదలెట్టేసింది. ఈ విధానాన్ని బాహాటంగా చికిత్సలో వాడింది ప్యాచ్ ఆడమ్స్ అనే అమెరికా వైద్యుడు. ఆయన్ను మంచి హ్యూమరిస్ట్‌గా కూడా అభిమానిస్తారు. వైద్యరంగంలో హ్యూమరో థెరపీ ప్రభావాన్ని గుర్తించేలా చేసిన ఆయన మీద ఓ హాలీవుడ్ సినిమా కూడా తెరకెక్కింది. ప్రఖ్యాత హాలీవుడ్ కామెడీ సూపర్ స్టార్ రాబిన్ విలియమ్స్ పాచ్ ఆడమ్స్ పాత్ర పోషించారు. సూసన్ కబయాషి అనే క్యాన్సర్ రోగి తన తోటివారితో కలిసి 'కెమో బడ్డీస్' అనే గ్రూప్‌ను ఏర్పాటు చేసి కీమోథెరపీ సమయంలో నలిపేసే బాధను నవ్వుల్లో మరిచిపోవడానికి ప్రయత్నించింది. క్లౌన్స్ వితౌట్ బోర్డర్స్, రెడ్ నోసెస్ క్లౌన్ డాక్టర్స్ ఇంటర్నేషనల్, ఆర్ ఎక్స్ లాఫ్టర్, అలయన్స్ ఫ్రాన్సిస్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఈ క్లౌన్ డాక్టర్ల వృత్తిని విస్తరించేందుకు కృషి చేస్తున్నాయి.

మనది అరనవ్వే...

మన దేశంలో మాత్రం ఇంకా మొగ్గ దశలోనే ఉంది. ఇక్కడ వలంటీర్లే ఎక్కువగా నవ్విస్తున్నారు. చాలా ఆస్పత్రుల యాజమాన్యాలకు ఇటువంటి సేవలు కూడా ఉంటాయనే విషయం తెలీదు. ఫ్రాన్స్‌కు చెందిన అలయెన్స్ ఫ్రాన్సిస్ సంస్థ ద్వారా బెంగళూరుకు వచ్చిన సెవెరీన్ బ్లాంచెట్ క్లౌన్ డాక్టర్ సేవల్ని అందించారు. అక్కడి కిద్వాయి మెమోరియల్ పిల్లల ఆసుపత్రిలో తొలుత ఓ ప్రాజెక్ట్ చేపట్టారు. అది హిట్ అవడంతో మిగతా ఆస్పత్రులకు కూడా వలంటీర్లను పంపారు. కొన్ని కోర్సులను రూపొందించి స్థానిక సర్కస్ కళాకారులు, ఔత్సాహికులు, సేవా కార్యకర్తలను క్లౌన్ డాక్టర్లుగా

నవ్వుల గోళీ..

కంప్యూటర్‌కు రిఫ్రెష్ బటన్ ఎలానో, మనిషి బుర్రకు నవ్వు అలా. లేకపోతే సిస్టమ్ హ్యాంగ్ అయిపోయిద్ది. లేదా స్లో అయిపోయిద్ది. నవ్వడం అంటే ఆరోగ్యానికి పార్టీ ఇచ్చినట్టే.

- జీవిత కాలం పెరుగుతుంది. నిరంతరం ఏదో విషయంలో దిగులు పడేవారి కంటే హాయిగా నవ్వుతూ గడిపేవారు ఎక్కువ కాలం జీవిస్తారు. ప్రతి దాన్ని సమస్యగా చూసేవారి మరణాలకు కారణమయ్యే విషయాల ప్రభావం తక్కువ.
- బాధ, నొప్పి తీవ్రతల్ని తగ్గిస్తుంది. మార్ఫిన్ కన్నా శక్తివంతంగా పనిచేసే సహజ ఎండార్ఫిన్ల ఉత్పత్తిని పెంచి నొప్పిని మాయంచేస్తుంది. 15 నిమిషాలు నవ్వుల్లో మునిగితే ఓ మత్తు మందు కలిగించే 'హై' భావనకు చేరుతాం. అది ప్రశాంతతను తెస్తుంది. తాత్కాలికంగానైనా నొప్పి తెలీదు.
- ప్రేమ, పెళ్లి, కుటుంబం వంటి బంధాల్ని వెలిగిస్తుంది. ఇష్టపడిన వ్యక్తి దగ్గర అమ్మాయిలు 125 శాతం ఎక్కువ నవ్వేందుకు ప్రయత్నిస్తారు. అంటే ఎక్కువ నవ్వుల వరాలు కురిపిస్తారు. బంధం బలపడినట్టే కదా.
- ఒకరి నవ్వు పదిమందికి అంటుకుం టుంది. అదో చైన్ రియాక్షన్. పక్కవారితో కలిసి నవ్వుల్ని పంచుకోవడం వల్ల అందరి మధ్య స్నేహాలు పెరుగుతాయి.
- నవ్వు జీవక్రియల వేగాన్ని పెంచుతుంది. ఆరోగ్యవంతమైన డైటింగ్‌తో ఇది జత కడితే కొవ్వును కరిగించేస్తుంది. స్థూల కాయం నుంచి బయట పడేస్తుంది.

రూపొందించారు. క్లౌన్స్ వితౌట్ బోర్డర్స్, ది హ్యూమర్ ఫౌండేషన్, క్లౌన్ హీలర్స్, హోప్ డాక్టర్ల వంటి సంస్థలు మహా నగరాల్లో ఈ వృత్తిని అలవాటు చేస్తున్నాయి. బెంగళూరులోని కర్నాటక చిత్రకళా పరిషత్, ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, కలకత్తాలోని శాంతినికేతన్, చెన్నైలోని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ వంటి సంస్థల్లోని కొన్ని ఫైన్ ఆర్ట్స్ కోర్సులకు మరింత మెరుగులు దిద్ది క్లౌన్ డాక్టర్ల మాయా సంచీలో కొన్ని ట్రిక్కుల్ని జోడిస్తున్నాయి.

నగరాల్లో చిరునవ్వులు..

చండీగఢ్‌లోని ప్రఖ్యాత పిల్లల ఆసుపత్రి (పీజీఐఎమ్ఈఆర్) వైద్యులు భవనీత్ భారతి, ప్రభుజ్యోత్ మాల్హీలు 'మిస్ హీహీ', 'మిస్టర్ హో హో'లుగా సుపరిచితం. పిల్లలను వాళ్ల డాక్టర్లుగా కాక స్నేహితులుగా అల్లుకుపోతారు. ఓపీ విభాగంలో సందడి చేస్తూ ఆస్పత్రి భయాన్ని చెదరగొట్టేస్తారు. అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ కేర్‌కు కూడా సారథ్యం వహిస్తున్న వీరు క్లౌన్ డాక్టర్ సేవల ప్రభావాన్ని మిగతా వారికి కూడా వివరిస్తున్నారు. నెలకు 8000 మంది రోగులు వచ్చే ఆ ఆస్పత్రిలో నవ్వుల గలగలలు పొంగి పొర్లడానికి ఈ వైద్య జంట ముందడుగే కారణం. చండీగఢ్‌కే చెందిన నాటక రంగ దర్శకులు సుఖ్‌మణి కోహ్లిది కూడా ఈ రూటే. పోర్చుగీసు క్లౌన్ యాన్నాతో కలిసి పని చేస్తున్న ఆయన వివిధ వర్క్‌షాపుల ద్వారా క్లౌన్ డాక్టర్లపై అవగాహన కలిగిస్తున్నారు. 'ఫైండ్ ధైర్ క్లౌన్' పేరిట క్లౌన్ థెరపీని అందిస్తున్నారు. బెంగళూరుకు చెందిన గ్రాఫిక్ డిజైనర్ సంజయ్ బలాస్వర్ కూడా క్లౌన్ డాక్టర్ రంగంపై ఆసక్తి చూపి చిన్నారుల చుట్టూ చేరుతున్నాడు.



ఇక చెన్నై, పుదుచ్చేరిల్లో క్లౌన్ హీలర్ల పేరిట కెనడాకు చెందిన ఫిఫ్ ఫెర్నాండెజ్, హీమీష్ బాయ్‌డ్ జంట సేవలు విస్తరిస్తోంది. అక్కడి అరవింద కంటి ఆస్పత్రి, ఎగ్మోర్ పిల్లల చికిత్సాలయంతో పాటు వివిధ చిన్నారుల చికిత్సా కేంద్రాల్లో కేరింతల సవ్వడిని వినిపిస్తోంది. కోమలి మెడీ క్లౌన్ అకాడమీని ప్రారంభించి ఔత్సాహికులకు శిక్షణనిస్తున్నారు. ఫిఫ్ కెనడాలో క్లౌన్ డాక్టర్‌గా పనిచేసింది. ఇక హీమీష్ ఓ నాటక రంగ కళాకారుడు. వీరివురూ ఇక్కడి 'ఆరోవిల్లే' అంతర్జాతీయ నివాస సముదాయంలో స్థిరపడి ఏకమ్ ఫౌండేషన్‌తో కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'కనెక్టింగ్ టు ధైర్ హార్ట్స్' (చిరు హృదయాలను కలుపుతూ) అనేది వీరి మోటో. ఇలా వివిధ నగరాల్లో ఇప్పుడిప్పుడే క్లౌన్ డాక్టర్ల సందళ్లు మొదలయ్యాయి. వీరే కాక స్థానికంగా ఉండే మెజీషియన్లు, సర్కస్ క్లౌన్లు, నాటక రంగ కళాకారులు అడపాదడపా ఆస్పత్రుల్లో తమ సేవల్ని అందిస్తూ అక్కడి వాతావరణాన్ని తేలిక పరుస్తున్నారు. అలాంటి వారిలో ప్రవీణ్ తుల్‌పులే ముందున్నారు. 17 ఏళ్ల పాటు దేశ నావికా దళంలో కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా సేవలందించిన ఈ లెఫ్టినెంట్ కమాండర్‌కు చిన్నారులంటే ప్రాణం. క్లౌన్ మెజీషియన్ పింటూగా మారి చిన్ని పాపల కళ్లు సంతోషంతో వెలిగిపోయేలా చేస్తున్నాడు. పూర్తిగా చిరు తల్లుల నవ్వులకే అంకితమైపోయారు. ఇదీ ఓ రకమైన వృత్తనే స్పృహ కలిగితే.. ఈ రంగానికి ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య బృందాలు ప్రోత్సాహం లభిస్తే.. విదేశాల్లో మాదిరి ఓ కెరీర్‌గా మారే అవకాశం ఉంది. ఉద్యోగావకాశాలతో పాటు ఆస్పత్రి సేవలు మెరుగవుతాయి.

నవ్వుల పొట్లం విప్పి...

క్లౌన్ డాక్టర్ సేవలు ఇప్పుడిప్పుడే ప్రతి చోట అందవు కనుక మీకు మీరే అలా అవ్వండి. నవ్వండి.. నవ్వించండి. ఓ చిన్నారుల ఆస్పత్రికి నవ్వు మూటలు ఎత్తుకెళ్లండి. ఒక్కో ఇస్మైల్‌ను బయటకు లాగేసి అందరికీ పంచేయండి. పదాలు, పిలుపులదేముందండి.. క్లౌన్ డాక్టర్ కాకపోతే క్లౌన్

కిసుక్కుల పరిశోధన..

- డాక్టర్ జేమ్స్ వాల్ష్ 1928లో ఓ పరిశోధన ద్వారా నవ్వులు శస్త్రచికిత్సానంతర బాధని, నొప్పిని తగ్గిస్తాయని కనుగొన్నాడు. గాయాలు త్వరగా మానేందుకు కూడా పరోక్షంగా కారణమవుతుందని చెప్పాడు.
- కాలిన గాయాలకు హైడ్రో థెరపీ చేయించుకోవడమంతా బాధ మరోటి ఉండదు. దీన్ని తగ్గించేందుకు చిన్నారులకు కార్టూన్ షోలను చూపించి చికిత్స చేశారు. నొప్పి తీవ్రత తగ్గిందనే విషయాన్ని గమనించిన ఎమ్మెల్ కెల్లీ తదితర వైద్యులు దాన్ని 1984లో అప్లైడ్ బిహేవియర్ అనాలిసిస్ జర్నల్‌లో ప్రచురించారు.
- కార్టిసోల్ ఉత్పత్తిని తగ్గించి గుండెకు చాలా మేలు చేస్తుంది నవ్వు. కార్టిసోల్ ఓ స్ట్రెస్ హార్మోన్ దాడి. దాని నుంచి తప్పించేందుకు ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థ కణాల్ని యాక్టివేట్ చేసి డామేజ్ అయిన కణాల నుంచి నవ్వు రక్షణనిస్తుంది. రక్త కణాల ఉత్పత్తిని మెరుగు పరిచి ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. 1994, 96ల్లో చేసిన బెర్క్ పరిశోధనల్లో ఈ అంశం తేలింది.
- బర్న్ ఔట్ అనే కణాల క్షీణతను అడ్డుకుని పునరుత్పత్తికి కారణమవుతుందని 1990లో కోస్టర్ పరిశోధనల్లో కనుగొన్నారు.
- ఎండార్ఫిన్ల విడుదల పెంచి డిప్రెషన్ నుంచి నిర్లిప్తత నుంచి బయట పడేస్తుంది. జీవితం మీద కొత్త ఆశల్ని చిగురింపజేస్తుందని 1989 నాటి ఫ్రై బృందం పరిశోధన సారాంశం.
- టిట్జే 1996లో చేసిన ఓ పరిశోధన ద్వారా హ్యూమరో థెరపీ బీపీని తగ్గిస్తుందని తెలిసింది. భవిష్యత్తులో ధమనుల వ్యాధులు తలెత్తే అవకాశాల్ని తగ్గిస్తుందని తేలింది.
- శ్వాస నాళాల వ్యాకోచం పెంచి శ్వాస సమస్యలు లేకుండా చేస్తుందని,మ్యూకస్ (కఫం) ఉత్పత్తి పెరక్కుండా 1985లో ర్యాబిన్‌స్టెయిన్ నిరూపించారు. అంతే కాదు హానికారక కొవ్వును కూడా తగ్గిస్తుందట.
- దీర్ఘకాలిక వ్యాధుల నుంచి తప్పించేందుకు సాయపడుతుంది. శరీరం సెల్ఫ్ హీల్ చేసుకునేందుకు తోడ్పాటునందిస్తుంది. ఈ విషయాన్ని మెక్‌గీ 1979లో, కజిన్స్ బృందం 1996లో బలపరిచారు.

యాక్టర్. కనీసం జోకర్‌గా జోక్‌గానైనా నటించండి. కొందరి దగ్గర భారీ జోక్ పేల్చినా పెదాలు మిల్లీ మీటర్ అయినా సాగవు. కళ్లెదుట ఓ ప్రాక్టికల్ జోక్ తోక ఊపినా పట్టించుకోరు. బిగదీసుకుపోతారు. లేదా నవ్వును నోట్లో బిగేసుకు కూర్చుంటారు. మరేం ఫర్లేదు వీరితో కూడా నవ్వించొచ్చు. అయితే ఆ నవ్వుకు పర్మిషన్ వాళ్లే ఇవ్వాలి. లోలోపల గిరికీలు కొడుతూ ఎప్పుడు బయట పడాలా అని తలను గుండెకో బుర్రకో ఏసి బాదుకుంటున్న నవ్వుల్ని విడుదల చేయాలి. లేదా పేరోల్ మీద బయటకు వచ్చే ఖైదీల్లానైనా కాసేపు బయట తిరగనివ్వగలగాలి. అప్పుడే వీరిలోని ఫన్నీ గయ్ విడుదలవుతాడు. ఈ షెడ్యూల్‌ను ఫాలో అయిపోతే, ఇక మీ నవ్వులకు గేట్లు ఎత్తేసినట్టే. ఆనక ఆ ప్రవాహాన్ని ఆపడం మీ తరం కాదు.

☺ కష్టాల కాలం నడుస్తుండొచ్చు. అంత మాత్రాన నవ్వుల పరుగాపకండి. అలా చేస్తే కష్టాల కన్నా రేసులో మీరే ముందుంటారు. నవ్వులు మీ ఆలోచనను పక్కకు తప్పిస్తాయి.

☺ తరచూ నవ్వగలగడం అలవాటు చేసుకోండి. రోజులో ఓ సారైనా నవ్వేందుకు ఓ కారణాన్ని, విషయాన్ని ఎంచుకోండి. ఫస్ట్ ఫేక్ నవ్వే. తర్వాత ఆ నవ్వే ఒరిజినాలిటీ అయిపోతుంది.

☺ కొన్ని జోక్స్ చదవండి, రాయండి, పేల్చేయండి. లేదా ఓ నవ్వుల కట్టు కథ అల్లేయండి. దాన్ని పక్కోడికి కళ్లకు కట్టి.. అతణ్ని కొట్టి మరీ నవ్వండి.

☺ ఓ డైరీలా జోక్ బుక్ మెయిన్‌టైన్ చేయండి. ఈ రోజు ఏ జోక్ ఎలా పేల్చారు. ఏ విషయం బాగా నవ్వు తెప్పించింది. ఎలా నవ్వారనే విషయాల్ని మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ మళ్లీ మళ్లీ నవ్వుకుంటూ పేజీల్ని తిరగరాసేయండి.

☺ చుట్టూ కావాల్సినంత వినోదం ఉంటుంది. దానికి గేలం వేస్తే సరి. భిన్న ప్రవర్తనలతో వేడుక చేసే పాత్రలెన్నో చుట్టూతా తిరుగుతుంటాయి. బిల్డప్ ఇచ్చే వారిలో కోరుకున్నంత మూర్ఖత్వం ఉంటుంది. వాటిలో వెరైటీల్ని పట్టి నవ్వుకోండి. ఎదుటి వాణ్ని నొప్పించకుండా నవ్వుకోగలిగితే చాలు.

☺ చిన్నదానికి పెద్దదానికి అంతెత్తున అరిచే వాణ్ని చూసో, ప్రపంచాన్ని, సంస్థను తన భుజస్కంధాలపై మోసేస్తున్నట్టు ఫీలింగ్ ఇస్తూ సీరియస్‌నెస్ తప్ప ఏ రియాక్షన్ లేని ఫేసుల్ని చూసో ఇలా మీ ఇష్టమండీ. ఇబ్బందిలో పడే అవకాశముంటే వాళ్లకు తెలీకుండా పక్కకు తిరిగో, కాస్త పక్కకు వెళ్లో ఎలాగోలా నవ్వేయండి.

☺ టీవీల్లో కామెడీ షోలను అస్సలు మిస్సవ్వద్దు. నవ్వుల పొట్లం విప్పే సినిమాల్ని, వీడియోల్ని చూస్తుండండి. సరదా ఆటనో, పాటనో కానివ్వండి. కామెడీ క్లబ్‌కు వెళ్లండి. మీకు చక్కిలిగింతలు పెట్టేందుకు ఎన్నో వెబ్‌సైట్లు మెటికలు విరుస్తూ తిష్ఠ వేసుకున్నాయి. వాటిని ఓ చూపు చూడండి.

☺ ప్రతి అడ్డాలోను నవ్వుల గ్యాంగులు కొన్నుంటాయి. ఇద్దరు కలిస్తే చాలు ఎందుకు నవ్వుతారో తెలీకుండా తెగ నవ్వేస్తుంటారు. వారితో కాస్త ఫ్రెండ్‌షిప్ చేయండి బాబూ. రెండో మూడో నవ్వుల్ని అంటించేస్తారు.

☺ శృతి మించని, గతి తప్పని చిలిపి పనులు చేసేయండి. తిరిగి పంచ్ పడితే మిమ్మల్ని చూసి మీరే నవ్వుకోండి. చిన్న విషయాలకు కూడా ముక్కు చీదుకుంటూ మరీ ఏడ్చిన సందర్భాలుండి ఉంటాయి. వాటినోసారి గుర్తుచేసుకోండి. అప్పుడు ఏడ్చారు సరే మరి ఇప్పుడు వాటిని తలచుకుని నవ్వేయండి.

☺ శారీరక శ్రమ నవ్వే మూడ్‌ను పెంచుతుంది. తోటపనో, కసరత్తో దినచర్యలో పెట్టుకోండి. బాత్రూమ్ సింగింగే కాదు, హాల్లో ఒంటరి డ్యాన్స్ షో కూడా మీకు మీరే ఏర్పాటు చేసుకోండి.



ఢిల్లీ వాలా జోకర్..

ఢిల్లీకి చెందిన అశ్వత్ భట్ గాట్టిగా నవ్వులతో దిక్కులు పిక్కటిల్లేందుకు పెద్ద ప్రయత్నమే ప్రారంభించాడు. ఉత్తరాఖండ్‌లోని తన స్టుడియోలో మరికొందరు క్లౌన్ మిత్రులకు శిక్షణనిచ్చి 'థియేటర్ గ్యారేజ్ కంపెనీ' పేరిట ఢిల్లీలోని పిల్లల ఆస్పత్రులను చుట్టొస్తున్నాడు. నాటక రంగ కళాకారుడు, దర్శకత్వ శాఖలో విశేష అనుభవమున్న అశ్వత్‌కు ప్రేక్షకుల కరతాళ ధ్వనుల కన్నా పిల్లలు కొట్టే కేరింతలే అమూల్యమని అంటాడు. బాధతో నీరసించి పోయిన మొహాలపై తిరిగి నవ్వును పూయించడానికి మించిన గొప్ప విషయమంటూ మరోటి తనకు లేదని చెబుతాడు. ఎయిమ్స్‌లోని పిల్లల వార్డు, క్యాన్సర్ వార్డులో తరచూ తన ప్రదర్శనలిస్తాడు. దేశమంతటా తిరుగుతూ వివిధ ఎన్జీవోలను కూడా సందర్శిస్తాడు. తన బృందంతో కలిసి కిలకిలల ప్రదర్శనలిస్తాడు. ఈ బృందంలోని తపస్యా దాస్ గుప్తాని కూడా ఈ క్లౌన్ వైద్యమే కుంగుబాటు నుంచి బయట పడేసింది. తన తల్లికి కేన్సర్ అని తేలడంతో వారి కుటుంబం తీవ్ర నిరాశలోకి జారిపోయింది. వారింట మళ్లీ నవ్వులు వినిపించింది హ్యూమర్ థెరపీనే. మరో క్లౌన్ డాక్టర్ శ్రుతి శర్మ మాటల్లోనైతే మళ్లీ చిన్నారుల్లా గడిపే, ఆలోచించే అవకాశం ఈ వృత్తి అందిస్తుంది.



☺ మీ తరం కాదని అనుకుంటున్న ఆటల్ని (స్కేటింగ్, హులా హూపింగ్, లెమన్ స్పూన్, కుదిరితే తొక్కుడు బిళ్ల కూడా) ఆడండి. తడబడండి తెగ నవ్వేయండి.

☺ వేషధారణ, స్టైల్ మార్చి అద్దంలో చూసుకోండి. అదే సూపర్‌మేన్‌లానో, చంద్రముఖిలాగో. ఇక లకలకలకే.. (అదే వెరైటీగా కిలకిలకిలే).

☺ లాఫింగ్ యోగా అని కూడా ఉందండోయ్. దాన్ని ఓసారి ట్రై చేయండి. మర్చిపోకుండా ఈ గొలుసు కట్టు యాపారంలో మరిందర్ని ముఖ్యంగా మీ కుటుంబాన్ని సభ్యులుగా చేర్చండి.

నవ్వేల్ – పువ్వేల్





'టీ' చారు

టీచరు: సోము.. నువ్వు పెద్ద అయిన తర్వాత ఏం కావాలని కోరుకుంటావు..?

సోము: నేను కూడా మీలాగే మంచి టీచర్ కావాలని ఉంది సార్ అని చెప్పాడు

టీచరు: టీచరు కావాలంటే ఏం చేయాలిరా?

సోము: ఏముంది సార్.. టీ లోకి చారు పోస్తే టీచరు అవుతారు కదా...

టీచరు:......!!!!!

అపర కర్ణుడు

"అయ్యా నా పేరు సత్యమూర్తి. ఈ చుట్టుపక్కల పది గ్రామాల్లోకెల్లా ధనవంతులు మీరు. మీరు అపర దానకర్ణులని చేతికి ఎముక లేకుండా దానధర్మాలు చేస్తారని చాలా మంది చెప్పారు. ఏదైనా సాయం చేసి పుణ్యం కట్టుకోండి". కోటీశ్వరుడు విశ్వామిత్రతో మొర పెట్టుకున్నాడు ఓ వ్యక్తి. దానికి బదులుగా "మీరే ఓ చిన్న సాయం చెయ్యండి మీరు వెంటనే తిరిగి వెళ్ళి అవన్నీ ఒట్టి మాటలని వారందరితో చెప్పండి". అన్నాడు కోటీశ్వరుడు.

క్రాస్ ఎగ్జామిన్....



దొంగతనం కేసు నుంచి క్లయింట్‌ను కాపాడేందుకు హోరాహోరీగా వాదిస్తున్నాడు ఓ లాయరు. బోనులో ఉన్న సాక్షిని వీర లెవల్లో క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నాడు.

నా క్లయింట్ దొంగతనం చేశాడని ఎలా చెప్పగలవు? అని సాక్షిని అడిగాడు లాయరు.

రాత్రి షట్టర్ పగలకొట్టి షాపులోకి వెళ్ళడం నా కళ్లారా చూశాను అన్నాడు బోనులో ఉన్న సాక్షి.

మరి అతను బయటికి రావడం చూశావా? అని అడిగాడు లాయరు.

లేదు... అని సమాధానమిచ్చాడు.

చూశారా మిలార్డ్! సాక్షి చెప్పినదాన్ని బట్టి చూస్తే నా క్లయింట్ ఇంకా షాపులోనే ఉండాలి. కానీ ఇప్పుడతను మీ ఎదుటే ఉన్నాడు. కాబట్టి ఈ సాక్షి చెబుతోంది అబద్ధమని తెలుస్తుంది అంటూ వాదించాడు...

కథలు



ఒక రచయిత: నేనీ మధ్య టీవీ సీరియల్స్‌కు కథలు రాసి అమ్ముతున్నాను. తెలుసా?

శ్రోత: ఇంతవరకు ఏమైనా అమ్మావా?

రచయిత: ఆ.... ఒక వాచీ, ఉంగరం.

రామదాసు

టీచర్: రామదాసు అసలు పేరేంటి రవి?

రవి: అక్కినేని నాగార్జున టీచర్!

ప్రశాంతం

పెళ్లయి యాభై ఏళ్ళు కాపురం చేసిన తరువాత ఇప్పుడు భార్యకు విడాకులు ఇవ్వాలనుకుంటున్నారా? నాలుగైదేళ్ళలో మీరు కూడా చావబోతున్నారు? అని కోపంగా అడిగాడు జడ్జి.

చచ్చే ముందైనా కాస్త ప్రశాంతంగా చద్దామని యువరానర్! అని సమాధానమిచ్చాడు తాతారావు.

ఎంబీబీఎస్

ఆపరేషన్ సగంలో ఆపేసి ఏం దొరికిందని డాక్టర్ ఇంత ఇదిగా బయటకు పరుగులు తీస్తున్నారు?! అడిగాడు మురళి.

అదా...ఆయనకి ఎమ్.బి.బి.ఎస్ సీట్ దొరికింది! చెప్పాడు కంపౌండర్.

వీధి కుక్కలకు హోటల్ గూడు



గ్రీసుకు చెందిన లెస్బోస్ దీవుల్లోని మైటిలీన్ ఊరిలో ఓ రెస్టారెంట్‌కు రాత్రి వేళల్లో వెళితే మీకు నమ్మశక్యం కాని ఓ విషయం ఎదురౌతుంది. వీధి కుక్కలన్నీ స్లీపోవర్ నైట్‌కు వచ్చినట్టు దర్జాగా అక్కడి సోఫాలు, టేబుళ్లపై విశ్రాంతి తీసుకుంటూ కనిపిస్తాయి. 'హాట్ స్పాట్' అనే పేరున్న ఈ రెస్టారెంట్ గిరాకీకి ఏం తక్కువ కాదు. కేవలం వీధి కుక్కల నిద్రావస్థలపై జాలితో ఇలా ఓనర్లే వాటికి రాత్రుళ్లు గూడు కల్పించారు. ఇదంతా గత జులై నుంచి మొదలైంది. ఓ రోజు ఇంకా తెల్లవారక ముందే ఓ కుక్క రెస్టారెంట్ బయట చలికి తట్టు కోలేక దీనంగా లోపలికి చూస్తూ ఓ వెయిటర్‌కు కనిపించింది. వెంటనే అతను దాన్ని లోపలకు తీసుకువచ్చి వెచ్చదనం కలిపించాడు. ఇక అప్పటి నుంచి అదే కాదు మిత్రులు, కొత్తవి అన్ని కూడా రోజంతా తిరిగి తిరిగి రాత్రయ్యే సరికి ఈ రెస్టారెంట్‌కు చేరిపోతాయి. మిగిలిన వంటకాల్ని చక్కగా విందారగించి హాయిగా నిద్ర పోతాయి. దీన్ని ఓ వ్యక్తి ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టేస్తే అది చూసి ఇదేంటి కుక్కలు పడుకున్న చోట మనం విందు చేయడమేంటని కస్టమర్లు అనుకోలేదు. ఇంకా చెప్పాలంటే బాగా పాపులరైపోయి కస్టమర్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఎటొచ్చి తెలిసేది ఏమిటంటే లెస్బో వాసులు దయా హృదయులని.

వింత లోకం



ఆ కప్పుతో నీళ్లు తాగినా జ్యూసే!

కోలాల మీద కోలాలు తాగితే గానీ దాహార్తి తీరకపోవడం... జ్యూస్ జుర్రుమంటే గానీ బొజ్జ సద్దుమణగకపోవడం... పరోక్షంగా మిమ్మల్ని ఊబకాయుల్ని చేసే తీపి చేటే. వాటిపై అతిగా అలవాటు పడిపోయిన ప్రాణాలకు ఒక్కసారిగా ఓ మధుమేహ సమస్యో వచ్చిందంటే ఇక అంతే. ఈ తెగవారికో తీపి కబురు. ఒట్టి నీళ్లు తాగినా సోడానో, కోలానో, జ్యూసో తాగిన ఫీలింగ్ వచ్చే ఓ సరైన కప్ వస్తోంది. లెమన్ లైమ్, ఆరెంజ్, మిక్స్‌డ్ బెర్రీ, యాపిల్, పీచ్, కోలా ఫ్లేవర్లను మూతికి అంటించుకుని మీ నోరు తీపి చేయనుంది. రైట్ కప్‌గా రాబోతున్న ఈ కప్‌లో కేవలం నీళ్లు పోసి తాగితే చాలు. ఫ్లేవర్ల సువాసనను ఎగజిమ్మే ఓ సెంటెడ్ ఇన్నర్ లైన్ దీని మూతికి ఉంటుంది. నోటిని ఆనించి తాగుతుంటే ఆ ఫ్లేవర్లు ఆఘ్రాణించవచ్చు. రుచి అనేది అనుభవానికి చెందినది కాబట్టి అది కూడా వాసన మీదే ఆధారపడి ఉంటుంది కాబట్టి ఒట్టి నీళ్లు తాగుతున్నా అదో డ్రింక్ అని మెదడు భ్రమిస్తుంది. ఓ సారి వాడటం మొదలెట్టాక ఆరు నెలల పాటు ఇలా సువాసనల్ని గుప్పుమనే ఈ కప్‌కు రూపకల్పన చేసింది ఐసాక్ లావి అనే వ్యక్తి. స్థూలకాయంతో పాటు మధుమేహంతోను బాధపడుతున్న ఐసాక్‌కు డ్రింక్‌లంటే మహా పిచ్చి. నోరు కట్టుకునే బదులు ఏదైనా ఉపాయం ఆలోచిద్దామని తెగ ఆలోచిస్తే ఇలా ఈ సరైన కప్ బుర్రలో వెలిగింది. ప్రస్తుతం మార్కెట్ స్థాయిలో ఉత్పత్తికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడు.

'అంటరాని' గోడ

పేదోళ్లు ఎక్కువ నేరాలు చేసేస్తారని, అందుకే వారు చేరకుండా గోడ కట్టుకున్నామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారు వారిని దోచుకుతినే 'పెద్ద' మనుషులు. ఈ గోడ ఏ ఇంటికో చుట్టూ కట్టుకున్న ప్రహరీ కానే కాదు. ఇది లక్షలాది మంది నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతాన్ని వేరు చేస్తూ ధనవంతులు ఏర్పాటు చేసిన భారీ గోడ. అదీ 10 కిలోమీటర్ల పొడవునా. ఓ రకంగా చెప్పాలంటే అది బెర్లిన్ గోడకు ఏమాత్రం తీసిపోదు. అంటరానితనం, వెలివేత అనే పదాలకు నిలువెత్తు నిదర్శనం. పెరూలోని లిమా పెరూ నగరంలో మూలగా ఉండే నిరుపేదల సబర్బన్ ప్రాంతం విస్టా హెర్మోసాకు అడ్డుపడుతూ కోటీశ్వరులు ఉండే లాస్ కాసరీనాస్ ప్రాంతం వైపు నుంచి కట్టిన గోడ ఇది. గోడకు అటువైపేమో విలాసవంతమైన ప్యాలెస్‌లు, కేజిల్స్, విల్లాలు, దర్జా అంతా కనబడే దారులు. ఇటువైపు రేకుల షెడ్లు, చెక్క ఇళ్లు, మురికి వీధులు. అటువైపు విద్యుత్, తాగునీరు, మురుగు కాలువలు వంటి మౌలిక వసతులు లేమి. ఇటువైపు స్విమ్మింగ్ పూల్స్, భారీ లైటింగ్ వ్యవస్థ, పటిష్టమైన రోడ్లు. పస్తులతో పడుకునే ఆకలి మంటకు, తిండి అరక్క వచ్చే గ్యాస్ మంటకు తేడా చూడాలంటే ఆ గోడ పైకెక్కితే చాలు. దీన్ని 'వాల్ ఆఫ్ షేమ్' అని పిలవడంలో తప్పేం లేదన్నది కొందరి మాట.

కొండ 'వాలు' గది

పెరూలోని కస్కో లోయ ప్రాచీన ఇంకా నాగరికతకు గుండె కాయ లాంటిది. ఇక్కడి లోయ ప్రాంతాన్ని సందర్శించాలంటే పెట్టి పుట్టాలంటారు. కేవలం సందర్శనేమిటి లోయ వాలును 360 డిగ్రీల కోణంలో లుక్కేయండి, ఓ కునుకేయండి.. ఇంకా చెప్పాలంటే గాల్లో తేలుతున్నట్టు విడిది చేయండి అంటున్నారు నేచర్ వైవ్ స్కై లాడ్జ్ హోటల్ వారు. మూడు భారీ అద్దాల పెట్టెల్ని వాలులో ఏర్పాటు చేశారు. భూతలం నుంచి 1,312 మీటర్ల ఎత్తున ఉండే ఈ క్యాప్సూల్స్‌లో అడుగు పెట్టాలంటే పెట్టి పుట్టడం కాదు గట్టి గుండె ఉండాలి. విమానాల్లో వాడే అల్యూమినియాన్ని, ఎటువంటి వాతావరణాన్నైనా తట్టుకునే పాలీ కార్బొనేట్‌ను, బుల్లెట్ ప్రూఫ్ అద్దాల్ని వాడి దీన్ని నిర్మించారు. దీనిలో నాలుగు బెడ్లు, చిన్న డైనింగ్ ఏరియా, ప్రత్యేక స్నానాల గదిని ఏర్పాటు చేశారు. 8 మంది వరకు హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చని చెబుతారు గానీ వాటి వాలకం చూస్తే ఎక్కడ దొర్లి లోయలో పడతాయో అని భయం కలుగుతుంది. అంత అందాన్ని చూడటానికి సాహసం చేయాల్సిందే అనుకుంటే మరో అడ్డంకి ఎదురౌతుంది.



చూద్దామా



అద్దమంటి మసీదు

వేల నక్షత్రాల జిలుగు బిలుగులను అద్దుకున్నట్టుందో మసీద్. కాంతుల సందోహంలో అద్దాలు, స్పటికాలు ధగధగలాడిపోతుంటే గగనపు తారలు సెలయేళ్లు కట్టాయేమో అనిపిస్తుంది ఇరాన్‌లోని షా ఈ షెరాగ్ మసీద్ అంతర్మందిరాన్ని పరికిస్తే. ముస్లిం త్యాగమూర్తులు శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్న ఆ ప్రాచీన మసీదుకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. దీనిలానే ధగధగలతో దూరాన్నుంచీ మనసును లాక్కెళ్లే మరో క్రిస్టల్ మసీదు మలేషియాలో ఉంది. ఇదేమో అత్యాధునికం. ఈ కాంతి పుంజాల అందాల్ని అచ్చెరువుల్ని కనాల్సిందే.





ఒకప్పటి పర్షియా మహా సామ్రాజ్యమే ఇరాన్. మహా సంస్కృతి ఆనవాళ్లు ఇప్పటికీ అక్కడి కట్టడాల్లో భద్రంగా ఉన్న ఆ దేశంలో షెరాగ్ పట్టణం అతి ముఖ్యమైంది. ప్రాచీన కాలం నుంచే కవులు, మహాత్ముల రచనలకు పట్టాభిషేకం చేసిన ఆ నేలకు కాంతుల చక్రవర్తి అని అర్థం. స్త్రీ, పురుషులిద్దరూ ఆ దేవుని ముందు ఒకటే, ఎదుటి వాడి బాధను తన బాధగా తీసుకోని ఎవడూ కూడా మనిషి కాదని చెప్పిన ఓ ముస్లిం మహా కవి మాటల్ని అందంగా తోరణం కట్టిన కాలీగ్రఫీ, ఇస్లాం ధామానికి దారి పరిచినట్టుండే ఖురాన్ గేట్లు ఆ పట్టణానికి స్వాగతం పలుకుతాయి. జ్ఞాన కేంద్రంగా పేరొందిన ఈ పట్టణం ఒకప్పుడు 50 ఏళ్ల పాటు పర్షియా రాజధానిగా కూడా కొనసాగింది. అలాంటి చారిత్రక పట్టణంలో తళుక్కున మెరిసేదే షా ఈ షెరాగ్ మసీద్. ఎక్కువగా షియా ముస్లింలు ఉండే ఇరాన్‌లో ఇది పవిత్ర యాత్రాక్షేత్రం. వారి ఏడో ఇమామ్ మూసా అల్ ఖదీమ్ కుమారులైన అమీర్ అహ్మద్, మీర్ మహమ్మద్‌లు క్రీశ 9-10వ శతాబ్దాల మధ్య అబ్బాసిడ్ రాజ్యం సాగించిన మారణహోమంలో ఇక్కడే నేలకొరిగి అమరులయ్యారు. వారిని ఖననం చేసిన ప్రాంతాన్ని ఆ తర్వాత విశ్వాసకులు సమాధిగా నిర్మించారు. అప్పటి మత పెద్ద అయిన అయతుల్లా దస్తఘైబ్‌కు చాలా దూరం నుంచి ఓ కాంతి కనిపించిందని.. దాని మూలస్థానాన్ని వెతుకుతూ వెళ్లిన ఆయన అక్కడి శ్మశానంలోని ఓ సమాధి గుండా కాంతి ప్రసరిస్తోందని గుర్తించాడని గ్రంథాల్లో ఉంది. తీరా ఆ సమాధి అమీర్ అహ్మద్‌దిగా నిర్ధారణ అయ్యింది. మీర్ మహమ్మద్ సమాధిని కూడా గుర్తించి దాన్నో మసీద్‌గా మలిచారు. అయితే అద్దాలు, స్ఫటికాలు, రజత కాంతులతో శోభాయమానంగా రూపునిచ్చింది మాత్రం 14వ శతాబ్దికి చెందిన రాణి తాషి ఖతీన్. ఆమె విశేషంగా ఖర్చు చేసి ఈ మసీద్‌కు స్వర్ణ కళను తెచ్చింది. ఓ ఆధ్యాత్మిక పాఠశాలను నెలకొల్పి మరింత అభివృద్ధి చేసింది.

ప్రతి అణువులోను మెరుపే..

ఈ మసీద్‌లో అణువణువూ అపురూపమే. రెండు మినరేట్‌లను చెరో చివరన నిలుపుకున్న ఇక్కడి బహు విశాల వరండా (పోర్టికో) ప్రాంగణంలో వందలాది మంది ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. పచ్చరాతిని లక్కలో అమర్చిన 10 వరసలతో ఆ ప్రాంగణం ఉంటుంది. భూకంపాల వల్ల డోమ్

బీటలు వారడంతో ఇనుముతో చేసిన డోమ్‌ను 1958లో మార్చారు. అయితే పూర్వ డోమ్‌కు దీనికి తేడా అస్సలు గుర్తించలేరు. ప్రజలు తమ డబ్బుతో పునరుజ్జీవింపజేశారు. ఎన్నో మార్పు పటిష్టపరిచే పనులు జరిగాయి.

మొజాయిక్ రాతి, అద్దం అందాల మధ్య చక్కటి క్యాలిగ్రఫీ ఖురాన్‌లోని వాక్యాలను గోడలపై చెక్కారు. మూడు వైపులా విశాలమైన తోట, ఫౌంటెయిన్‌లతో పర్షియా శైలి మసీద్ నిర్మాణ కళ విశేషం కనిపిస్తుంది. మసీద్ లోపలకు వెళ్లగానే ఒకింత సంభ్రమాశ్చర్యాలకు లోనవుతారు. వేల తారలను తెంపి పైకప్పుకు అతికించినట్టుగా అనిపిస్తుంది. అద్దాలు, స్ఫటికాల్లో పరావర్తనం అయిన కాంతి అనేక పుంఖాను పుంఖాలుగా వెదజల్లినట్టు కనిపిస్తుంది. గోడలు, కిటికీలు, ద్వారాలు ఇలా ప్రతిదీ చిన్న, చిన్న అద్దాల ముక్కలతో అలంకరించి ఉంటాయి. స్ఫటికపు మెరుగులు వీటికి అదనం. నీలి, రోజా, పచ్చ, పసుపు రంగుల్ని కురిపించే షాండ్లియర్‌ల కాంతులు వేల ముక్కలుగా పరావర్తనం అవుతుంటే వివశులమైపోతాం. ప్రధాన ద్వారాలు, గది మూలల్లో స్వర్ణ, రజత పట్టీలపై పట్టుతో రాసిన ఖురాన్ వాక్యాలను ఫ్రేమ్ కట్టారు. పచ్చరాయి నేల మీద రుధిర వర్ణపు ఇరానియన్ కార్పెట్ పరిచి ఉంటుంది. డోమ్‌ను ఈ మధ్యే పునర్నిర్మించినా అప్పటి రూపానికి ఏ మాత్రం భేదం లేకుండా జాగ్రత్త పడ్డారు. మరో ప్రత్యేకత ఏమిటంటే ఆ పట్టణానికే పేరు తెచ్చిన మసీదు శైలి. మిగతా ప్రాంతాలకు భిన్నంగా డోమ్, మసీద్‌కు మధ్యలో అమరుల సమాధి స్థలి ఉంటుంది. చూడ్డానికి రెండింటినీ ఒకేలా స్వర్ణ అలంకరణలు, నగిషీలతో తీర్చిదిద్దినా వారి పరిమాణాల్లో తేడాల ద్వారా అన్నదమ్ముల సమాధులను గుర్తించొచ్చు. ఇక్కడ అన్నింటి కన్నా విశేషమైనవి స్వర్ణపు ఖురాన్ ప్రతులు. రాణి తాషి ఖతీన్ ప్రత్యేక శ్రద్ధ వహించి 30 సంపుటాల్లో ప్రతులను తయారుచేయించింది. అప్పటి యాహ్యా జమాలి క్యాలిగ్రఫీ రాతలో అక్షరాలను బంగారంతో



అలంకరించారు. ఇప్పటికీ ఈ స్వర్ణ ఖురాన్ భద్రంగా పార్స్ మ్యూజియంలో ఉంది. 700 ఏళ్ల నాటి ఈ స్వర్ణ గ్రంథమే కాదు ఆనాటి కట్టడంలోని ప్రధాన నిర్మాణాలన్నీ చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి. ఇంత అద్భుతమైన నిర్మాణంలో పాలుపంచుకున్న రాణి సమాధికి కూడా ఇక్కడ స్థానం కల్పించారు. మత విశ్వాసకులు, యాత్రికులకే కాదు పర్యాటకులకు కూడా ఇదో అద్భుతమైన, అపురూపమైన కట్టడం. ఒక్కసారైనా దీన్ని సందర్శిస్తే చాలు అనుకునే వారెందరో.

మలేషియాలో మరో స్ఫటిక

క్రిస్టల్ మసీదుగా పేరొందిన మరొటి మలేషియాలోని తెరేన్‌గాన్నులో ఉంది. మనిషి సముద్రంలో సృష్టించిన వాన్ మాన్ కృత్రిమ దీవిలో ఈ అద్దాల మసీద్ కనువిందు చేస్తుంది. మస్జీద్ క్రిస్టల్‌గా పిలిచే ఈ మసీద్ ఇరాన్‌లోని మసీద్‌కు పూర్తిగా భిన్నమైందే అయినా దీని ధగధగలు కూడా తాదాత్మ్యంలో ముంచెత్తుతాయి. షా ఈ షెరిగె ప్రాచీనతతో కాలాన్ని స్తంభింపజేస్తే, మస్జీద్ క్రిస్టల్ ఆధునికతలోకి తరుముకెళుతుంది. 2006-08 మధ్య నిర్మించిన ఈ కట్టడం పూర్తిగా ఉక్కు, అద్దంతోనే కట్టిన ఏకైక మసీద్. మలేషియాలోనే తొలి స్మార్ట్ మసీద్‌గా పేరు తెచ్చుకున్న దీనిలో వై-ఫై అనుసంధానత ద్వారా ఎలక్ట్రానిక్ ఖురాన్‌ను విశ్వాసకుల అందుబాటులో ఉంచారు. ఏకకాలంలో 1500 మంది ప్రార్థనలు నిర్వహించుకునేలా భారీ హాల్,



ప్రాంగణాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. రోజులోని ఒక్కో సమయంలో ఒక్కోలా వెలుగులు విరజిమ్మే ఈ మసీదు అందాల్ని పూర్తిగా తిలకించాలంటే రాత్రి పూట అలంకరించే విద్యుత్ వెలుగుల్లోనే. నీలం, రోజా, పచ్చ, పసుపు రంగుల్లో లైటింగ్‌ను మార్చే ఏర్పాటు ఉంటుంది. మొత్తం కట్టడం స్టీల్, గ్లాస్‌తో ఉండటం వల్ల మూలమూలాల్లో కాంతులు పరావర్తనం చెంది ఓ లైట్ షోను తలపిస్తాయి. తూర్పు ఇస్లాం దేశాల్లో విస్తరించిన షఫీ నిర్మాణ శైలిలో ఈ కట్టడాన్ని నిర్మించారు. మొత్తం 4 మినరేట్‌లు ఉంటాయి. ఇక్కడి సూర్యోదయ, అస్తమయాలు చాలా బాగుంటాయి. నారింజ రంగు కాంతులు మసీదుపై ప్రసరించి అరుదైన అనుభూతిని కలిగిస్తాయి. పట్ట పగళ్లు డోమ్‌పై వికిరణాల వల్ల స్వర్ణ తాపడం చేయించినట్టుగా తోస్తుంది. హాల్ మధ్యలో ఓ భారీ షాండ్లెయిర్ వెలుగులు బయటకు కూడా కనిపిస్తాయి. కాంతి ప్రసరించడానికి వీలుగా గోడల్ని అద్దాలు, కిటికీలతో చక్కగా మలిచారు. ఈ మొత్తం కట్టడమంతా ఇస్లామిక్ హెరిటేజ్ పార్క్ (తామన్ తమాడున్)లో భాగంగా నిర్మించిందే. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అద్భుతమైన ఇస్లామిక్ కట్టడాల నకళ్లను ఇక్కడ నిర్మించారు. వాటిలో మన దేశానికి చెందిన తాజ్‌మహల్, బ్రూనైలోని దారుస్సలామ్ మసీద్, ఇస్రాయిల్‌లోని డోమ్ ఆఫ్ రాక్, చైనాలోని జియాన్ మినరేట్‌లు ఉన్నాయి. వాటికి అచ్చు గుద్దినట్టు కనిపించే ఈ కట్టడాలను సందర్శిస్తుంటే ఏదో ప్రపంచ యాత్ర సాగిస్తున్న అనుభూతి కలుగుతుంది. వివిధ ప్రాంతాల శైలుల్లో కొలువైన మసీద్‌లన్నీ ఒక చోట నెలవై ఉండటం నిజంగా విశ్వాసకులకు దివ్యానుభూతిని కలిగిస్తే పర్యాటకులకు ఎక్కడలేని సంతోషాన్ని కలిగిస్తుంది.

-జే ఎస్పీ

అందరి జీవితమూ వడ్డించిన విస్తరి కాదు. అల్లుది అంతకన్నా కాదు. క్షీరారామంలో నిరుపేదగా జీవితాన్ని ఆరంభించిన అల్లు రామలింగయ్య వెలకట్టలేని అభిమానధనాన్ని మూటగట్టుకుంది తన హాస్యపు జల్లులతోనే. మూడు రూపాయలు కిరాయి తీసుకునే నటుడి స్థాయి నుంచి వెండితెరన వెలిగిన తీరులో అనేక అనుభవాలున్నాయి. గాంధేయ మార్గంలో పయనించి స్వాతంత్ర్య పోరాటంలో జైలు శిక్ష అనుభవించిన దేశభక్తునిగా అనేక అనుభూతులు ఉన్నాయి. 'పుట్టిల్లు' చిత్రం ద్వారా చలనచిత్ర పరిశ్రమలో అడుగిడి హాస్య తారగా వెలుగులీని పద్మశ్రీని పొందిన అరుదైన నటుడు.

అల్లు హాస్యపు జల్లు

పాలకొల్లులోని ఓ పేద కుటుంబంలో అల్లు వెంకన్న, శాంతమ్మ దంపతులకు అక్టోబరు 1వ తేదీ 1922లో జన్మించారు అల్లు రామలింగయ్య. అల్లు జీవన పయనం నేల మీద నించే ప్రారంభమయ్యింది. తారాస్థాయికి దూసుకుపోయింది. వృత్తి పరంగా నటుడే అయినా ప్రవృత్తి పరంగా హోమియో వైద్యుడు. ఏ రోగానికి ఏ మందు వాడాలో...ఎలా నయం చేయాలో చేయి తిరిగిన వాడు. దాన్నే జీవితానికి అన్వయించుకున్నాడు. ఆయనో వ్యూహకర్త. అందుకు ఆయన ప్రతి అడుగులోనూ ఓ ప్రణాళిక ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

సినీ నటుడిగా..

పుట్టిల్లు చిత్రం ద్వారా సినీ నటుడిగా అడుగు

పెట్టిన అల్లు సాదాసీదా నటుడిగానే ప్రస్థానం ప్రారంభించాడు. ఆ రోజుల్లో రేలంగి, రమణా రెడ్డి, సి.యస్.ఆర్., బాలకృష్ణ, పద్మనాభంల ప్రభ వెలిగిపోతోంది. వారి మధ్య హాస్య నటుడిగా ఎదగడం అసాధ్యం! అనడంలో ఆలోచించాల్సిందేం లేదు. ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నటుడు అల్లు రామలింగయ్య. 'ప్రజా నాట్యమండలి'లో నటనానుభవం వున్నా చిత్రసీమలో ఇంకేదో కావాలి. దర్శక, నిర్మాతలను ఆకర్షించాలి. వారిని బాగా మెప్పించి తదుపరి చిత్రాల్లో అవకాశాలు సంపాదించాలి. బక్కప్రాణి.. ఎక్కువ మంది సంతానం... పేదరికం.. కొమ్ములు తిరిగిన తోటి నటులూ... వీటన్నింటి మధ్య పోటీ పడటం అల్లూకే సాధ్యమైంది. మాయా బజార్, మిస్సమ్మ చిత్రాల్లో చిన్న పాత్రలే చేసినా పెద్ద గుర్తింపే పొందాడు. గుర్తింపు సరే... నటుడిగా స్టార్‌డమ్ రావద్దూ? అల్లూ చాలా కష్టపడి తన కెరీర్‌కి ఒక్కో మెట్టూ తానే నిర్మించుకున్నాడు.

కొన్ని మజిలీలు

పరివర్తన, వద్దంటే డబ్బు, దొంగ రాముడు, సంతానం, భాగ్యరేఖ, తోడికోడళ్లు, పెళ్లి నాటి ప్రమాణాలు, అప్పుచేసి పప్పుకూడు, మంచి మనసుకి మంచి రోజులు, కృష్ణలీలలు, గుండమ్మకథ, నర్తనశాల, కృష్ణార్జున యుద్ధం, చదువుకున్న అమ్మాయిలు, మూగ మనసులు గొప్ప మజిలీలు. ముఖ్యంగా మూగమనసులు చిత్రం అల్లు స్థాయిని పెంచింది. అక్కినేనికి పోటీగా పడవ నడిపేవాని పాత్రలో... జమునని నాగభూషణానికి అంటగట్టే వ్యూహంతో జమున చేత చావు దెబ్బలు తినే సన్నివేశంలో తన నటనతో ప్రేక్షకుల మెప్పునీ, గుర్తింపునీ పొందగలిగాడు. తరవాత కెరీర్ మరో మలుపు తిరిగింది.. పరమానందయ్య శిష్యుల కథ చిత్రంతో. ఇందులో రాజబాబు, పద్మనాభాలతో సమానమైన గౌరవాన్ని అందిపుచ్చుకున్నాడు. రణభేరి, పూలరంగడు చిత్రాల్లో ఆ వేగం స్థిరపడింది. ఆ తరువాత మరో గొప్ప చిత్రం బుద్ధి మంతుడు.

'బుద్ధి మంతుడు'తోనే 'ఆమ్యామ్యా'..

బాపు, రమణలకూ అల్లూకు మధ్య అందమైన అవగాహన వుంది. అల్లూలో ఏం వుందో బాపు, రమణలకు తెలుసు. బాపు, రమణలకేం కావాలో అల్లుకి తెలుసు. అందుకే 'ఆమ్యామ్యా' (లంచం) తీసుకునే పాత్రలో అంతగా ఇమిడిపోయాడు. చివరికి అల్లు ఊతపదం లంచానికి పర్యాయ పదంగా తెలుగు, తమిళనాట ఆమ్యామ్యాగా మారుమోగిపోయింది. 'అల్లు' ఇక వెనక్కి తిరిగి చూసుకోవలసిన పనిలేకుండా పోయింది. బాపు, రమణలదే మరో మహత్తర చిత్రం 'ముత్యాల ముగ్గు'. ఈ చిత్రంలో అల్లు అనితర సాధ్యమైన నటన గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. సరిగ్గా అదే సమయంలో చేతికందిన కొడుకు రైలు యాక్సిడెంట్‌లో తన ఇంటి సమీపంలోనే (టి.నగరు

రామకృష్ణా వీధి దగ్గర) అతి దారుణంగా మృత్యువాత పడ్డాడు. అటువంటి సమయంలో కూడా చలించకుండా వృత్తి పట్ల అంకితభావంతో 'ముత్యాల ముగ్గు' చిత్రంలో 'కోతిచేష్టలు' చేసే పాత్ర వేసి అందర్నీ కదిలించాడు. అప్పుడు తెలిసింది 'అల్లు' మనోబలం ఎంతో.

చిరంజీవి - అల్లు అనుబంధం

చిరంజీవి అల్లు అనుబంధం ఉభయతారకమయ్యింది. చిరంజీవి పాదం అటువంటిది. అల్లు హస్తవాసి అటువంటిది. ఇద్దరూ ఒకరినొకరు ప్రాణప్రదంగా అభిమానించారు. చిరంజీవి పైకొస్తాడు, అంతా శుభమే జరుగుతుంది అన్న బాపూ, రమణల మాట అక్షర సత్యమయ్యింది. చిత్రాలు పెరిగాయి. గుర్తింపూ పెరిగింది. కొడుకు అరవింద్ అందివచ్చాడు. ఆ రోజుల్లో అల్లు లేని చిత్రాన్ని ఊహించుకోవడం కష్టమయ్యేది. ఏ పాత్రలో కనిపించినా ప్రేక్షకులు కేరింతలు కొట్టేవారు. 'అందాల రాముడు (బాపు, రమణల చిత్రమే) సహప్రయాణీకుడు 'తీ.తా'గా తీసేసిన తాసిల్దారు పాత్రలో జీవించాడు. అల్లు నటన మన కళ్ల ముందే కనిపించే కొన్ని సజీవమైన పాత్రలకు జీవం పోసేది.

'అల్లు' జైత్రయాత్ర

'మనుషులంతా ఒక్కటే' దాసరి చిత్రం. ఎన్.టి.ఆర్, జమున నాయికా నాయకులు. ఇందులో అల్లు, రమాప్రభతో కలసి 'ముత్యాలు వస్తావా, అడిగిందీ ఇస్తావా? పాటకు స్టెప్పులు వేసి హోరెత్తించారు. 'యమగోల' (ఎన్.టి.ఆర్) చిత్రంలో చిత్రగుప్తుడంటే ఇలాగే వుంటాడని అనిపించుకున్నాడు. గోరంత దీపం (బాపు, రమణల బొమ్మ) శివరంజని, తాయారమ్మ–బంగారయ్య, వేటగాడు, సర్దార్ పాపారాయుడు, కిరాయి అల్లుడు, న్యాయం కావాలి, మొండి ఘటం, (ఇవన్నీ చిరంజీవి చిత్రాలు) 'మంత్రి గారి వియ్యంకుడు' (చిరు హీరో అల్లు ప్రధాన పాత్రలో), ప్రేమ పిచ్చోళ్ళు, కొండవీటి సింహాసనం, ఇది పెళ్లంటారా? శుభలేఖ, బొబ్బిలి పులి, జస్టిస్ చౌదరి, బొబ్బిలి బ్రహ్మన్న (కృష్ణంరాజు), విజేత (చిరు), హీరో (చిరు), గూండా (చిరు), చట్టంతో పోరాటం (చిరు), స్టేట్ రౌడీ (చిరు), అత్తకు యముడు–అమ్మాయికి మొగుడు (చిరు) ఇలా ఒకటా రెండా? స్టార్ హీరోలు ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చిరంజీవి చిత్రాల్లో అల్లుకి ఓ ప్రత్యేకమైన స్థానం వుండేది. అది అల్లు స్వశక్తితో సంపాదించుకున్న స్థానం!

అవార్డులూ–రివార్డులూ

స్వచ్ఛంద సేవా సంస్థలు అందించిన అవార్డులకు లెక్కలేదు. ప్రజానాట్య మండలిలో నటిస్తున్నప్పుడే నృత్య కళామండలి వారు హాస్య కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు. 1990లో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. ప్రతిష్టాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డు 2001లో అల్లుకి దక్కింది. విశ్వనాథ వారి శంకరాభరణం, సప్తపది చిత్రాలను మరచిపోలేనన్నారు అల్లు. "బాపు రమణలు, కె.విశ్వనాథ్, రాఘవేంద్ర రావు, దాసరి వీరు నా జీవన పయనంలో ఆలంబనగా నిలిచినవారు. అక్కున చేర్చుకున్న వారు. చిరంజీవితో అనుబంధం జన్మజన్మల సంబంధం." అనేవారు చెమర్చిన కళ్లతో.

సకుటుంబ సపరివారమంతా..

కొడుకు అరవింద్ ఈ రోజు ఇండస్ట్రీలో ప్రముఖుడు. చిరంజీవి అల్లుడు, సురేఖ కూతురు. అల్లు అర్జున్, రామ్‌చరణ్, శిరీష్‌లు మనవళ్లు. నాగబాబు, పవన్ కల్యాణ్‌లు వీరంతా సినీ రంగంలో మంచి స్థాయికి చేరుకున్నారు. తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.

అల్లు స్థితప్రజ్ఞుడు!

సుఖ దుఃఖాలు రెండిటినీ సమానంగా స్వీకరించగల వ్యక్తి. మానవ సంబంధాలకు పెద్దపీట వేసిన వ్యక్తి. అల్లు అర్ధాంగిని గురించి విశేషంగా చెప్పుకునేవారు. కనకరత్నమ్మ నిజంగా కనకరత్నమే! అని. నటనని ప్రాణప్రదంగా ప్రేమించిన వ్యక్తి అల్లు. చాలా మంది నటులన్నట్లు పాత్రలో పరకాయ ప్రవేశం చేయడం కాదు, పాత్రల్ని మనలో ఇముడ్చుకుని ఆ పాత్రలు మాత్రం కనిపించేలా చెయ్యాలి అనేవారు. "నాకు వేషం ఇవ్వండి. బతికించండి. డబ్బులొద్దు. మంచి వేషం ఇవ్వండి. నేను పోయినా నేను చేసిన పాత్రలు బతికుండిపోవాలి!" అని కోరుకున్న వ్యక్తి! అది నిజం. ఎన్ని పాత్రలు... ఆమ్యామ్యా, తీతా, తాళము వేసితిని గొళ్లెం మరిచితిని, దొరకునా ఇటువంటి సేవ! (శంకరాభరణం), నేనూ... గాంధీగారూ... (కాలం మారింది) ఏది మరిచిపోగలం? అల్లూని ఎలా మరిచిపోగలం. అల్లు పాత్రలు అజరామరం!

- ఇమంది రామారావు
9010133844

కె. విశ్వనాథ్‌తో...

రమాప్రభతో...

చిరంజీవితో కలిసి...

రావుగోపాల రావుతో ...

నూతన్ ప్రసాద్‌తో...

స్టార్

దుర్వ్యసనం కళను సృజించలేదంటారు భారతీయ సుస్వరకర్త, అంతర్జాతీయ సంగీతకారుడు ఏ ఆర్ రహ్మాన్. సంగీతం ఓ ముక్తి మార్గం. మద్యమో, మాదక ద్రవ్యమో మార్దవ గీతాన్ని సృజించేందుకు ప్రేరణ కాదు. సంగీతం పని కాదు ఉత్ప్రేరకాలతో చేయడానికి. కేవలం ఆస్వాదన, తపనే సృష్టించగలదు అంటాడు. చెన్నై వరదల సహాయక చర్యల్లో భాగంగా ఈ నెలలో చెన్నై, కోయంబత్తూర్‌లో 'నెంజె ఇజు' (ఉప్పొంగనీ హృదయాన్ని) పేరిట కచేరీలిచ్చేందుకు తంత్రుల్ని సవరిస్తున్నాడు ప్రస్తుతం. ఇలాంటి సంగతులెన్నింటినో మీడియాతో పంచుకున్నాడు రహ్మాన్ ఇటీవల. వాటిలో కొన్ని...

'దుర్వ్యసనం కళను సృజించలేదు'

- మా సంగీత అకాడెమీలో 70-80 మంది కళాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. వారిలో 10-12 మంది వరకు నా ఆర్కెస్ట్రాలోనే ఉన్నారు. దాని పేరు సన్‌షైన్ ఆర్కెస్ట్రా.
- మాకో కల ఉంది. చెన్నై నగరానికో ఉత్తమ శ్రేణి కళా కేంద్రాన్ని రూపొందించాలి. సిడ్నీలోని ఒపెరా హౌజ్‌లా అది ప్రాచుర్యం పొందాలని. అది నగరానికి ల్యాండ్ మార్క్‌గానే కాదు ఓ ఐకాన్‌గా నిలిచిపోతుందనే విషయం చాలా మంది అర్థం చేసుకోరు.
- మనకు సంగీత ప్రదర్శనలకు పాఠశాల సమావేశ మందిరాల్లాంటివి ఉన్నాయి. అవే మేటి కళాకారులను సృష్టిస్తున్నాయి. అక్కడి నుంచి వచ్చేవారే ఇప్పుడు అమెరికా, ఇంగ్లండ్‌లలో ప్రదర్శనలిస్తున్నారు.
- ఈ ఏడాది కావాలనే సినిమాల సంఖ్య తగ్గించుకున్నాను. గతేడాది 12 సినిమాలకే సంగీతం అందించాను. మా పిల్లలతో, సంగీత పాఠశాల పనుల్లో, సినీ నిర్మాణానికి ఎక్కువ సమయం కేటాయించాలని నిశ్చయించుకున్నాను. అవన్నీ ఏదో రకంగా సంగీతానికి ముడిపడే ఉంటాయి.
- మొహెంజోదారో, ఎంథిరన్ 2.0, పీలే: బర్త్ ఆఫ్ ఎ లెజెండ్ చిత్రాలతో పాటు నా సొంత నిర్మాణ సంస్థ నుంచి వస్తున్న హిందీ, తమిళ చిత్రాలకు మాత్రమే ఈ ఏడాది పనిచేస్తున్నాను.
- ఈ మధ్యే విడుదలయిన 'మహమ్మద్' చిత్రం ప్రవక్త మార్గంలోని గొప్ప విషయాలపై చేసింది. ప్రవక్త ఉపదేశించిన సత్యమార్గంపై వచ్చింది.
- కొన్నిసార్లు విషయాల్ని మాటల కన్నా సంగీతం బాగా వ్యక్తం చేస్తుంది. ఇక్కడ విడుదలయితే గనుక మహమ్మద్ చిత్రాన్ని చూస్తే సంగీతానికి అర్థమేమిటో మీకు బాగా తెలుస్తుంది. సినిమా చూడకున్నా సంగీతం ద్వారా చిత్రం అర్థమేంటో తెలుసుకుంటారు.
- వాస్తవం చెప్పడానికే అప్పట్లో స్పందించాను. ఎవరినీ నొప్పించడానికి కాదు. ఆ సమయంలో నేను దేనికైనా సిద్ధంగా ఉన్నాను. ప్రతిదానికి భయపడితే మనం ఇంటి నుంచి బయటకు ఒక్క అడుగు కూడా వేయలేం. జీవితంలో మనకు కొంచెం సాహసం కూడా ఉండాలి. మంచి ఉద్దేశాలకే అనుకోండి. లేకుంటే ఏదీ కదలదు. మీరు కనుక మానవ మేలుకు గొప్ప శ్రద్ధ తీసుకుంటే ఇటువంటి చిన్న విషయాలు లెక్కే కాదు.
- ఓ ప్రైవేట్ ఆల్బమ్ చేయడం కన్నా చిత్రానికి సంగీతం అందించడం తేలిక. ఆల్బమ్ కోసం బాగా ఆలోచించాలి. కానీ సినిమాకు ఓ స్క్రిప్ట్ ఉంటుంది. దర్శకుడు, గీత రచయిత ఉంటారు. సినిమానే మొత్తాన్ని ప్రమోట్ చేసేస్తుంది. మనం హాయిగా కూర్చుని ఆస్వాదిస్తే సరిపోతుంది.
- సంగీతంలో సాంకేతికతపై పెద్ద చర్చే నడుస్తోంది. ప్రపంచ నలు చెరుగులా చాలా మందితో మాట్లాడాను. ఎక్కడా దీనిపై ఏ సెన్సార్‌షిప్ లేదు. సంగీతం అనేక పొరల్లో ఉంటోంది. ఏ స్వరకర్త మెలొడీనైనా ప్రజలు ప్రేమిస్తారు. అది సాంప్రదాయక సంగీతమైనా, సాంకేతికతపై ఆధారపడినదైనా. రెండిటికీ శ్రోతలున్నారు. ఒకప్పుడు ఒకే రకం సంగీతం ఉండేది. ఇప్పుడది అనేక రూపాల్లో కలిసి ఉంటోంది. దీన్ని విమర్శకులు అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నారు.
- టీవీలో ఏది వస్తే అదే సంస్కృతి అయిపోతోందే కానీ ఏది టీవీలో రావాలో అది కాదు. అద్భుతమైన సృజనలెన్నో చాలా వరకు దాగుండిపోతున్నాయి. వాటినెవరూ ప్రమోట్ చేయట్లేదు.
- సాహిత్యం నాకు అతి ముఖ్యం. అలాగే అది ఆసక్తికరంగానూ ఉండాలి. మనం పలికే ప్రతి మాటలోను ఓ మేజిక్ ఉంటుంది. ఆ శబ్దానికి ఓ మేజిక్ ఉంటుంది. దూషణలు, అసభ్య సాహిత్యాన్ని నేను ఇష్టపడను. ఒకళ్లను ఆకట్టుకోవడానికి ద్వంద్వ రచనలకు చోటివ్వకూడదు. ప్రజలపై తప్పుడు ప్రభావం పడుతుంది.
- నేను చాలా అదృష్టవంతుణ్ని. అనవసర విషయాల నుంచి మా అమ్మ, కుటుంబ సభ్యులు నన్ను కాపాడారు. నేను కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరూ నాలో స్ఫూర్తి రగిల్చారు. ముఖ్యంగా మణిరత్నమ్, కవి వైరముత్తు, గాయకులు.
- ప్రస్తుత సరళికి భిన్నంగా గొప్ప కళాకారులపై స్వీయ నిర్మాణంలో చిత్రాలను ప్లాన్ చేస్తున్నా. పాశ్చాత్య చిత్రాల్లో ఎక్కువగా చూపించేది మత్తుకు బానిసై, భార్యని కోల్పోయి, అర్థంతరంగా తనువు చాలించే కళాకారులపైనే. గొప్ప కళను సృజించేందుకు మత్తనేది ఉత్ప్రేరకమే కాదు. ఇళయరాజా గారు దానికో మంచి ఉదాహరణ. ఆ విషయంలో ఆయనంటే నాకు ఎంతో గౌరవం.

✦



'నడిచే' ఈత చెట్టు!

అడవిలో వేర్వేరు జాతి వృక్షాలు ఓ నిశ్శబ్ద యుద్ధాన్ని చేస్తాయి. అలాగే చెలిమి కడతాయి కూడా. ఇక్కడ పోటీ కంటే మనుగడే ప్రధానం. అందుకే సాధారణంగా విభిన్న రకాల చెట్లు, మొక్కలు పక్కపక్కనే కనిపిస్తాయి. అయితే కొన్ని చోట్ల కొన్నింటిదే ఆధిపత్యం. అక్కడి వాతావరణం, మృత్తిక తీరుకు కొన్నే అలవాటు పడగలవు. బతికి వేరు కట్టగలవు. వర్షారణ్య ప్రాంతాల్లో ఈ పసిగట్టలేని పోరు పతాక స్థాయిలో ఉంటుంది. కిక్కిరిసిపోయిన కీకరారణ్యంలో తమకంటూ కాస్త జాగా, కాస్త గాలి, వెలుతురుల వాటా కోసం అనేక ఉపాయాల్ని ఆచరణలో పెడతాయి వృక్షాలు. ఆ మనుగడ పోరులో ఈక్వెడార్‌లోని 'నడిచే ఈత చెట్టు'కు తిరుగులేదు. ఏడాదికి ఏకంగా 20 మీటర్ల దూరం ఇవి జరిగిపోగలవు.

మనకు పొద్దు తిరుగుడు పువ్వు బాగా తెలుసు. సూర్యుడి వెలుతురిని పట్టుకోవడానికి రోజంతా సూర్యుడి దిశలోకి మారుతుంటాయి. అలాగే రోడ్డుకిరువైపులా వేసిన చెట్లను గమనిస్తూనే ఉంటాం. గొడుగు కప్పినట్టు వాలిపోతుంటాయి. ఇదంతా వాటికి ప్రాణం పోసే గాలి వెలుతురులని గుప్పిట పట్టడం కోసమే. అమెజాన్ అటవీ ప్రాంతంలో ముఖ్యంగా ఈక్వెడార్‌లోని వర్షారణ్య ప్రాంతంలో ఓ రకం ఈత చెట్లు మనుగడ విధానం ఆశ్చర్యం కలిగిస్తుంది. అవసరాన్ని బట్టి గాలి వెలుతురులను, నేల సారాన్ని వెతుక్కుంటూ ఏడాదికి 20 మీటర్ల వరకు ఇవి నడిచేస్తాయి. నడవడం అంటే ఏదో మనం చేస్తున్నట్టు కాదు. అసలది నడకే కాదు. తమ వేర్లతో స్థలాన్ని మార్చుకుంటాయి. ఇది నిజంగా అద్భుతం. ప్రపంచంలో ఇప్పటి వరకు గుర్తించిన ఏ ఇతర చెట్టు కూడా తమ అసలు ప్రాంతాన్ని వదిలి ఇలా ఇంత దూరం పక్కకు జరగడమనే మాట లేదు. మనకు భారీ వృక్షాలను ల్యాండ్‌మార్క్ (కొండ గుర్తులు)గా చేసుకునే అలవాటు ఉంది. ఈక్వెడార్‌లో ఈ చెట్లను కనుక పొరబాటున అలా ల్యాండ్ మార్క్‌గా పెట్టుకుంటే కొన్నేళ్ల తర్వాత అవి పూర్తిగా అక్కడి నుంచి కొత్త ప్రాంతంలోకి జరిగిపోయి దారి తప్పే అవకాశముంటుంది. ఇలాంటి ఇబ్బందులెన్నింటినో చూశారేమో ఈ చెట్ల మీద అనేక మూఢ విశ్వాసాలను పెంచుకున్నారు స్థానిక గిరిజనులు. ఇవి రాత్రిళ్లు ఎవరూ చూడనపుడు అడవిలో తిరుగుతుంటాయని కథకథలుగా చెప్పుకుంటారు. ఆ కథల్ని విని చాలామంది పర్యాటకులు అక్కడి యునెస్కో సుమాకో జీవ గోళ అభయారణ్యానికి క్యూ కడుతుంటారు. సోక్రటియా ఎక్సోరిజా దీని శాస్త్రీయ నామం. మిగతా ఈత చెట్ల మాదిరిగానే పత్రాలుంటాయి గానీ తాడి చెట్టంత ఎదిగేస్తాయి. కొన్ని చోట్ల 30 మీటర్ల ఎత్తు వరకు ఇవి పెరుగుతాయి. అంతెత్తున చెట్టు నిలబడాలంటే బలమైన వేర్ల వ్యవస్థ ఉండాలి. దానికి అనుగుణంగానే మనిషికి రెండింతల ఎత్తులో పైకి కనిపించే వేర్లు ఉంటాయి. అవి నేలలో చాలా లోతు వరకు చొచ్చుకుపోతాయి. మరెక్కడా చూడని విధంగా వీటి వేర్ల నిర్మాణ తీరు ఉంటుంది. నేలపైకి పొడుచుకు వచ్చినట్టుండే ఇవి నలువైపులా చెట్టుకు పోటీనిస్తున్నట్టు నిలబడి ఉంటాయి. చెట్టు ప్రధాన భాగం అస్సలు నేలను తాకకపోవడం ఒక విడ్డూరమైతే అది కొన్ని అడుగుల ఎత్తులో ఉండటం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇటువంటి మనుగడ విధానాన్ని అవి అభివృద్ధి చేసుకోవడానికి కారణం అక్కడి నేల తీరు. ఎన్నో భారీ వృక్ష జాతుల వల్ల నేల సారం ఇట్టే తరిగిపోతుంది. దానికి తగ్గట్టుగా కొత్త ప్రాంతానికి అవి కదలిపోవాలి. మిగతా చెట్లకు ఇది అసాధ్యం. కానీ ఈ ఈత చెట్లకు అది చాలా తేలిక పని. ఎటువైపు సూర్యరశ్మి ఎక్కువగా పడుతుందో, నేల సారం ఎక్కువగా ఉందో ముందుగా ఒక పొడవాటి వేరు ద్వారా తెలుసుకుంటాయి. ఆ తర్వాత ఆ దిశగా కొత్త వేర్లను పెంచుకుంటాయి. ఇవి నేల వైపు వంగి చెట్టుకు ఆధారం ఇస్తుండగా చెట్టు కదిలేందుకు అడ్డుపడే వెనుక, పక్క వేర్లను క్షీణింపజేస్తాయి. అవి పూర్తిగా చనిపోయాక తేలిగ్గా నేల నుంచి వేరు పడతాయి. ఇలా అకస్మాత్తుగా ఉన్న ఫళంగా అవి కదలలేవు. నడక తీయలేవు. కేవలం కొత్త వేర్లను మరింత ముందరికి పెంచుకుని పాత వాటిని చంపుకోవడం ద్వారా స్థానం మార్చుకుంటాయి. వరదల ప్రభావం కూడా ఎక్కువ ఉండటం వల్ల చెట్టు దెబ్బతినకుండా ఉండేందుకు ఇలా పరిణామం చెంది ఉండొచ్చని వృక్షశాస్త్రవేత్తలు భావిస్తున్నారు. లభించే పోషకాలన్నింటినీ అది ఎత్తు పెరగడానికే ఉపయోగించడంతో చాలా వేగంగా మిగతా చెట్ల ఎత్తును దాటేస్తాయి. ఈ ఈత చెట్ల నుంచి కల్లు కూడా తీస్తారు స్థానికంగా. వీటి వేర్లతో చేసిన టీని మధుమేహానికి మందుగా స్థానికులు ఉపయోగిస్తారు. అలాగే బలమైన కలప ఉండట ంతో ఇళ్లు, ఇతర కట్టడాల్లోను ఉపయోగిస్తారు. వేటాడే బల్లాలకు వాడతారు. ఈ చెట్టుకు కాచే పసుపు రంగు ఫలాల్ని తింటారు. ఆకులతో టోపీలు, డొప్పల వంటివి తయారుచేసుకుంటారు. వీటి వేర్లు వెదురు బొంగుల్లా బోలుగా ఉండి ఎక్కువ నీటి నిల్వల్ని ఉంచుకుంటాయి. వీటిని నరికి జాగ్రత్తగా ఎండబెట్టి గొట్టాల్లా వాడుకుంటారు. ఇలా ఈ 'నడిచే ఈత చెట్టు'లోని ప్రతి భాగాన్ని ఏదో రకంగా వినియోగిస్తారు. మనిషి అవసరాలకే కాదు ఈ చెట్టు వివిధ రకాల ఫెర్న్, తీగ మొక్కలకు కూడా ఆధారాన్నిస్తోంది. ఈ వృక్షజాతి విశృంఖల విస్తరణకు ప్రధానంగా అడ్డుపడుతోంది ఓ అడవి వరాహం (వైట్ లిప్పడ్ పెక్కారి). ఈ చెట్ల విత్తనాలను ఇవి బాగా మెక్కేస్తాయి. దీని వల్ల 45 శాతం విత్తనాలు అంకురించకుండానే అరాయించుకుపోతాయి. ఈ విధంగా జీవ చక్రం బ్యాలెన్స్ అవుతుంది. మీకు తెలుసో లేదో కొన్ని వేల ఏళ్లుగా ఉన్న చెట్లు వాటి స్థానాల కన్నా కాస్త పక్కకు జరుగుతాయి.



◆ కథ

వర్ణ చిత్రం

-రావినూతల ప్రేమకిశోర్

9246834681

రోజుట్లాగే ఈ రోజూ తెల్లవారుతోంది. తాను తెల్లవారడం వలన ఓ బ్రతుకు తెల్లవారుతుందని తెలియని 'రోజు' మామూలుగానే తెల్లవారుతోంది. జీవితపు పెనుగులాట కోసం గోలగోలగా పరుగెడుతున్నన పిట్టల చప్పుళ్ళు. వీటన్నిటి కంటే ఎక్కువగా ఆ జైలులో బూట్ల చప్పుళ్ళు. ఆ అడుగులన్నీ మాధవి ఉన్న 'సెల్' వైపే వెళుతున్నాయ్... వస్తున్నాయ్... హడావుడి చేస్తున్నాయ్.

ఒక మనిషిని, అందులోనూ ఒక ఆడకూతుర్ని ఉరి తీయాలంటే ఎన్ని పనులు చక్కబెట్టాలని? మాధవిని రెడీ చేశారు. ఇష్ట దైవాన్ని ప్రార్థించుకోమన్నారు. నడవమన్నారు. కసాయిని అనుసరిస్తున్న మూగ జీవిలా వాళ్ళ వెనక నడిచింది. ఊచల మధ్య తలలన్నీ ఆమెను దీనంగా చూస్తున్నాయ్. బహుశా చేయగలిగింది కూడా ఏమీలేదు... దేవుణ్ణి ప్రార్థించడం మినహా ఉరికంబం స్వాగతం పలుకుతోంది. అధికారులంతా తమ ధర్మాలను నిర్వర్తిస్తున్నారు...చాలా సిన్సియర్‌గా ... పద్ధతులు పూర్తి చేసి ముఖానికి ముసుగేశారు. ఉరి బిగించారు. తలారి తన ధర్మాన్ని నిర్వర్తించాడు. చాలా విధేయతగా... మాధవి కాళ్ళు శూన్యంలో...

"అ...మ్...మ్మా... మాధవీ..." యల్లమంద దిగ్గున లేచాడు.

ooo

"సార్... నన్ను రక్షించండి... కాపాడండి..." అంటూ మాధవి స్టాఫ్ రూమ్‌కి వచ్చి పడిపోయింది. ఆమె చేతులు వెనక్కి విరిచి చున్నీతో కట్టి వున్నాయి. విషయం అర్థంకాక అక్కడున్న లెక్చరర్లు కాళిదాసు, రామ్మూర్తి కంగారుగా ఆమెను లేపబోయారు.

'ఆగండి... దాన్ని ముట్టుకుంటే నా భార్యపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని మీపై కేసు పెట్టాల్సి వస్తుంది' హెచ్చరిస్తూ లోనికి వచ్చాడు కళ్యాణ్ ఓ గుంపుతో సహా.

"భార్యేమిటి?" అర్థంకాక లెక్చరర్ రామ్మూర్తి అడిగాడు.

'తాళి కడితే భార్యే కదా!' అన్నాడు కళ్యాణ్ రవ్వంత వెటకారంగా. అప్పుడు గమనించారు వాళ్ళు. మాధవి మెడలో పసుపు కొమ్ము కట్టిన తాడు వేళ్లాడుతోంది.

"కళ్యాణ్ ఏమిటీ పిచ్చి పని. సరదాగా స్నేహితులతో పందెం కాసి ఓ అమాయకురాలి మెడలో తాళి కడతావా? ఎంత అన్యాయం? ఆమెను వదిలేయ్" కాళిదాసు కళ్యాణ్‌ని మందలించబోయాడు.

అది సహించలేని అతను మాష్టారి చెంప చెళ్ళు మనిపించాడు.

"చదువు చెప్పే గురువుపైనే చెయ్యి చేసుకుంటావా? నువ్వసలు మనిషివేనా...!?" మాధవి ప్రశ్నించింది.

'నా దారికి అడ్డం వస్తే అంతే' కత్తి తీసి టేబుల్‌పై గుచ్చాడు కళ్యాణ్.

మాధవివైపు అసహాయతగా చూసి లెక్చరర్లు మౌనంగా వెళ్ళిపోయారు, 'రాహుకాలం వెళ్ళి పోయింది బావా... శోభనం కానిచ్చేయ్...' వెనుక నుండి ఎవడో గొణిగాడు.

"కళ్యాణ్! దగ్గరకు రాకు. నన్నొదిలేయ్..."

అతడు వెంటాడుతున్నాడు. మాధవి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. అల్లరి మూక అతణ్ణి ఎంకరేజ్ చేస్తోంది.

"ఒంటరి ఆడదాన్ని చేసి, చేతులు విరిచి కట్టి మెడలో తాళి కట్టడం మగతనం అనిపించుకోదు. మర్యాదగా నా చేతి కట్లు విప్పు", కళ్యాణ్ ఆమె బట్టలు లాగబోయాడు. ఆమె తప్పించుకునే ప్రయత్నంలో బల్లపై వెల్లకిలా పడిపోయింది. అల్లరి మూక ఘొల్లున నవ్వసాగింది.

"రేయ్! ఇదెలా లొంగదో చూస్తా... మీరెళ్ళి బయట గడియపెట్టి కాపలా కాయండి. నేను పిలిచేంతవరకూ తలుపు తీయొద్దు."

'ఓకే...చిచ్చా. ఆల్ ద బెస్ట్...' అందరూ

బయటకెళ్ళారు. గడియ పెట్టిన చప్పుడు. బయటంతా గోల గోలగా వుంది.

మాధవి చేతుల్ని కాలితో తొక్కి పెట్టాడు. మాధవి కట్లు వదులు చేసుకునే ప్రయత్నిస్తోంది. పిల్లిని గదిలో బంధించి హింసిస్తున్నట్లుగా వుంది మాధవి పరిస్థితి.పెనుగులాటలోనే ఆమెను ఆక్రమించుకున్నాడు. ఆమె వైఫల్యంతో కుంగిపోతుంటే అతడిలో విజయ గర్వం...కళ్యాణ్ ఆమె మీద నుండి లేస్తుండగా అతని చూపు ఆమె మెడలో ప్రశ్నార్థకంలా మిగిలిన పసుపుతాడుపై పడింది.

"పందెం గెలిచాక ఈ బంధం ఎందుకు? ప్రతిబంధకంలా...' టప్పున మెడలో తాళి లాగేశాడు. మాధవి విస్తుపోయింది.

"పందెం నేనే గెలిచాను. సుఖమూ నేనే పొందాను, రెండు రకాలుగా నన్ను గెలిపించినందుకు థ్యాంక్స్. నా గిఫ్ట్‌గా ఈ తాళి ఉంచుకో. నీ పెళ్ళికి పనికొస్తుంది...బై..." అంటూ తాళిని మాధవి ముఖంపై విసిరేసి వెళ్ళి తలుపు తట్టసాగాడు. బయట గోలగోలగా నవ్వుకుంటున్న అల్లరిమూకకి ఆ శబ్దాలు వినపడటంలేదు. చీకట్లు ఆవరిస్తున్న ఆకాశంలో కొద్దిపాటి గర్జనలు...మాధవిని ఎగతాళి చేస్తూ ముఖంపై తాళి... ఆమెలో ఆవేశం కట్టలు తెంచుకోవడంతో చేతికట్లు సైతం పటాపంచలైనాయి. "రేయ్..." అంటూ వెనుక నుండి పసుపు తాడుని అతని మెడకి బిగించి "చావరా చావు... తాళిని ఎగతాళి చేసే నీలాంటి రాక్షసుడు బ్రతకడానికి వీల్లేదు...చావు..." అంటుండగా తాళి అతని మెడకు ఉరిలా కసిగా బిగుసుకుంది. ఇంతలో అతని ఫ్రెండ్స్ తలుపులు తీశారు. వాళ్ళని అలాగే చూస్తూ ... మాధవి కాళ్ళపై పడిపోయాడు నిర్జీవంగా.

ooo

"బాధపడకు మావా..." యల్లమందను ఓబులు ఓదారుస్తున్నాడు.

"ఒక్కగానొక్క బిడ్డ మాధవి. తల్లిలేని బిడ్డని ఈ సేతుల్లో బెట్టుకుని పెంచినా. పెద్ద సదువులు సదివి ఈ ముసలి తండ్రిని ఆదుకుంటాదని ఆశపడ్డా. మిత్తవలాగా ఈడొచ్చి నాబిడ్డ బతుకుని బుగ్గి సేసిపోయాడు. ఆణ్ణి సంపి పోలీస్టేషన్లో లొంగిపోయింది. ఆడెన్ని బాధలు పడతుందో...' కూతుర్ని తల్చుకుని కుమిలిపోసాగాడు.

"కేసు నడుత్తుందిగా. మహిళా సంగాలోల్లు, దళిత సంగాలోల్లు, ప్రజా సంగాలోల్లు మన పక్కనే వున్నారుగా..."

"మన పక్కన ఎంతమందున్నా ఏట్లాబం. డబ్బు, అధికారం, పలుకుబడి అన్నీ ఆ సచ్చినోడి తండ్రి నాగేంద్రం పక్కనుంటే..." అని వాపోయాడు యల్లమంద.

"ఆడి పక్కన ఎన్నున్నా నాయం మటుకు మన పక్కనుంది మావా...' ఓబులుకి అనుమానంగా వున్నా యల్లమందకి ధైర్యం చెప్పే ప్రయత్నం చేశాడు.

ooo

కోర్టు, కోర్టు హాలంతా జనంతో నిండిపోయింది. మాధవి కేసు గత కొద్దిరోజులుగా విచారణ జరుగుతోంది. విద్యార్థినులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళా సంఘాలు, దళిత సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలోనే హాజరైనారు. మరో పక్క మాధవికి ఎలాగైనా ఉరిశిక్ష వేయించాల్సిందేనని కళ్యాణ్ తండ్రి నాగేంద్రం తన పలుకుబడినంతా ఉపయోగించి పావులు కదుపుతున్నాడు. అతనికి మద్దతుగా అగ్రవర్ణ వర్గాలన్నీ నిలిచాయి. మాధవికి ఉరిశిక్ష పడితేగానీ తమకు మనుగడ లేదని భావిస్తున్నాయి. నాగేంద్రం ఏ ఒక్క అవకాశాన్నీ వదలడంలేదు. డబ్బుని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని కొనేశాడు. దొంగ సాక్ష్యాల్ని సృష్టించాడు. డాక్టర్‌ని కొనేశాడు. మాధవి మీద ఎటువంటి అత్యాచారం జరగలేదని, ఇప్పటికీ మాధవి 'వర్జిన్' అని కేస్ డీల్ చేసిన డాక్టర్ విశ్వనాథం ధృవీకరించాడు. డిఫెన్స్ లాయర్ రాంప్రసాద్ న్యాయం పట్ల నమ్మకం చెదరని వ్యక్తి. అభ్యుదయ భావాలు కలిగి, మానవీయ విలువలున్న అడ్వొకేట్‌గా ప్రతీతి. మాధవి కేసును రాంప్రసాద్ ఎన్నో కష్టనష్టాల కోర్చి ఒక సీక్వెన్స్ ప్రకారం వాదిస్తూనే వున్నాడు. కేసు రోజురోజుకీ కొత్త మలుపులు తిరుగుతోంది. మాధవి 'వర్జిన్' అని డాక్టర్లు ధృవీకరించడం అతడు ఊహించని పరిణామం. 'ఎవరెన్ని కుట్రలు చూసినా అంతిమ విజయం న్యాయానిదే...' అని ఆత్మవిశ్వాసంతో వున్నాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధవిని సవాలక్ష ప్రశ్నలు వేస్తున్నాడు. అన్నిటికీ జవాబులు చెబుతోంది. అడగకూడని విధంగా, అసభ్యకరంగా అడుగుతున్నాడు. అయినా మాధవి నిబ్బరంగా చెబుతోంది. శృతి మించిన చోట తెలివిగా సమాధానం చెబుతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖంగుతింటున్నాడు. అప్పుడప్పుడు తడుముకుంటున్నాడు.

ఇంతలో జడ్జి కలిపించుకుని "ఇంత తెలివిగా మాట్లాడే నీవు నేరం చేసినట్లు ఒప్పుకుంటున్నావా?" అని ప్రశ్నించాడు. ఈసారి మౌనం వహించడం మాధవి వంతయింది.

"మౌనం అంగీకారానికి సూచన..." అన్నాడు జడ్జి.

'మౌనం. ఎంత చక్కని పదం. ఆ పదంతో స్త్రీని అణగదొక్కుతూనే వున్నారు. (గుండెలు పగిలే వేదనను పంటిబిగుతులో ఆపుకుంటూ) దేవుడా! నాకెందుకీ శిక్ష... అని ప్రశ్నించుకునే రవంత విరామాన్ని కూడా మౌనంగా చిత్రీకరిస్తూ అందంగా నన్ను హంతకురాలిగా తీర్మానిస్తున్న న్యాయమూర్తిగారూ... మీరూ మగవారేనన్న విషయాన్ని మర్చిపోయాను. మౌనం నా ప్రశ్నకు సమాధానం కాదు....నా నేరానికి కన్‌ఫర్మేషనా..!?'

"చూడమ్మా... అది" అంటూ ఏదో చెప్పబోయి జడ్జీ నీళ్ళు నమిలాడు.

"మధ్యలో అడ్డొస్తున్నందుకు మన్నించండి. మీరేమీ చెప్పలేరు. ఎందుకంటే ఈ వ్యవస్థ మగవాడికి అందించిన గొప్ప కానుక 'అజమాయిషీ...' దానితోనే ఆడదానికి నగిషీలు చెక్కాలనుకుంటాడు."

కోర్టు హాలు చప్పట్లతో దద్దరిల్లింది. జడ్జి సుత్తికి



పని చెప్పాడు. ఎప్పుడూ అమాయకంగా కనిపించే మాధవిలో ఇంత చైతన్యం ఎక్కడిదని విస్తుపోయారు.

"అసలేం జరిగిందో చెప్పమ్మా...!?' విషయం తెల్సుకుందామనుకుని జడ్జి అడిగాడు.

"ఏం చెప్పమంటారు జడ్జిగారూ! అహంకారంతో, డబ్బు మదంతో సరదాగా స్నేహితులతో పందెం వేసి నా మెళ్ళో తాళి కట్టి, నా జీవితాన్ని ఎగతాళి చేసిన వైనం చెప్పమంటారా?... స్టాఫ్‌రూమ్‌లో అసహాయురాలిని చేసి నన్ను కాటేసిన మానవమృగం గురించి చెప్పమంటారా?... క్రూరంగా కోరిక తీర్చుకున్నాక కట్టిన తాళిని తన చేతుల్తోనే తెంపేసి నా ముఖంపై విసిరేసిన అగ్ర వర్ణ అహంకారం గురించి చెప్పమంటారా?...వికృత రాజకీయాలతో పచ్చనోట్లను ఎరగా చూపి సాక్ష్యాలను తారుమారు చేసి పోయిన శీలానికి ప్రతిగా 'కన్యత్వా'న్ని కానుకగా ప్రసాదించిన నాగేంద్రగారి కుటిలనీతిని వివరించమంటారా?... దేని గురించి వివరించమంటారు న్యాయమూర్తిగారూ...

అయ్యా జడ్జిగారూ! ఇదే దుర్మార్గాన్ని ఆ కళ్యాణ్ ఏ అగ్రవర్ణ స్త్రీ పైన అయినా ఇంత ధైర్యంగా, క్యాజువల్‌గా చేయగలడా? కచ్చితంగా చేయలేడు. ఎందుకంటే వాళ్ళ మధ్య పొలిటికల్, ఎకనామికల్ ఈక్వాలిటీ వుంటుంది కాబట్టి చచ్చినా అంతటి సాహసానికి ఒడిగట్టలేడు. అటువంటిది దళిత స్త్రీలంటే ఎందుకంత చులకన సార్?"

జడ్జిలో మౌనం...

"కళ్యాణ్ ఎంతటి రాక్షసుడైనా అతణ్ణి చంపే అధికారం నీకు లేదు..." పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధ్యలో కల్పించుకున్నాడు.

మాధవిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. 'భేష్.. ఇదే అన్యాయం మీ కుటుంబంలో ఏ ఆడకూతురికైనా జరిగితే ... ఆమె ఇటువంటి నిర్ణయమే తీసుకుని వుంటే అప్పుడుకూడా మీరు మీ కూతురుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని నీతి బోధ చేస్తారా...? ఇదే దుర్మార్గం డాక్టరుగారి కూతురిపై జరిగివుంటే నా కూతురు ఇప్పటికీ 'వర్జినే' అని సర్టిఫై చేసి సంబరాలు చేసుకుంటారా...? మామీద ఎందుకు సార్ ఇంత చులకన భావం? ఎందు కండీ ఇంత పక్షపాత ధోరణి...? ఏ దేవుడు మా ఆవేదనను అర్థం చేసుకుంటాడు? ఇంత మంది దేవుళ్ళలో ఏ ఒక్కరైనా మా దళితుల పక్షాన ఉండివుంటే మాకిన్ని వెతలుండేవి కావు... కన్నీటి కథలుండేవి కావు...' మాధవి గుండెల్లోని దుఃఖం తన్నుకొచ్చింది. వెక్కివెక్కి ఏడ్చింది.

"ఇంకా కోర్టుకు చెప్పుకునేది ఏమైనా వుందా...?" జడ్జి చివరగా ప్రశ్నించాడు.

"ఇప్పటికీ ఊరవతలే మా వాడలు. అంటరానితనం మా నడుముకు తాటాకై బతుకులనీడుస్తున్నాం. అవమానాలు ఉమ్మి ముంతై మమ్మల్ని వెక్కిరిస్తూనే వున్నాయ్. ఇన్నేళ్ళ స్వతంత్ర భారతావనిలో దళిత బతుకుల వర్ణ చిత్రం ఇదే సార్. యువరానర్! మనిషిగా నేనెప్పుడో చచ్చిపోయాను. శిక్ష గురించి నాకు బాధలేదు. మీరు ఏ శిక్ష విధించినా ఒక్కటే. కానీ. దళితులూ మనుషులేనని గుర్తించండి. వారిపై దాడులు జరగకుండా చూడండి. దళిత స్త్రీ పైన ఏ అగ్రవర్ణ చూపూ పడకుండా కట్టుదిట్టం చేయండి. చట్టాల్ని చిత్తశుద్ధితో అమలయ్యేలా చూడండి...' అంటూ నమస్కరిస్తుంది మాధవి.

జడ్జిలో కదలిక, ఇన్నేళ్ళ దళిత వ్యథని మాధవి ఆవిష్కరించింది.

డార్టర్ విశ్వనాథం లేచి "యువరానర్"!. మీరు అనుమతిస్తే ఈ కేస్‌కి సంబంధించిన నిజాల్ని కోర్టుకు విన్నవించాలని వుంది." అన్నాడు, జడ్జి "ఎస్... ప్రొసీడ్" అనగా విశ్వనాథం బోన్‌లో కెళ్ళి జడ్జికి నమస్కరించి 'మాధవి నా కళ్ల తెరిపించింది. యువరానర్! ఆ నాగేంద్రంగారు నన్ను బెదిరించి మాధవి 'వర్జిన్' అని సర్టిఫికేట్ ఇప్పించారు. కాని మాధవిపై అత్యాచారం జరిగింది వాస్తవమే. ఆ అత్యాచారం అతని కొడుకు కళ్యాణే చేశాడు. కోర్టుకు తప్పుడు సాక్ష్యం ఇచ్చినందుకు నన్ను క్షమించండి" అంటూ జడ్జికి నమస్కరించాడు. డాక్టర్ ఇచ్చిన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు.

జడ్జి నాగేంద్రం వైపు చూశాడు. నాగేంద్రం తల దించుకున్నాడు. రాజకీయం ముసుగులో నాగేంద్రం కుయుక్తులు గ్రహించాడు. లెక్చరర్ కాళిదాసు, లెక్చరర్ మూర్తి ఇచ్చిన సాక్ష్యాలను, రాంప్రసాద్ ప్రతివాదనలను పరిశీలించి తప్పనిసరి పరిస్థితులలో తన శీలాన్ని కాపాడుకునే ప్రయత్నంలో జరిగిన చర్యగా భావించి మాధవిని నిర్దోషిగా విడుదల చేస్తూ తీర్పునిచ్చారు. కోర్టును తప్పుదారి పట్టించినందుకు డాక్టర్ విశ్వనాథంకు మూడువేలు జరిమానా, నాగేంద్రంకు మొదటి తప్పిదంగా భావించి వార్నింగ్ ఇస్తూ తీర్పు చెప్పాడు.

అందరి కళ్లలో ఆనందం. ఇన్నాళ్ళకు వాడకు న్యాయం జరిగింది. యల్లమంద కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. న్యాయమూర్తికి చేతులెత్తి నమస్కరించాడు. జడ్జి వెళ్ళిన అనంతరం అందరూ మాధవిని అభినందించారు. నాగేంద్ర కళ్ళల్లో ఉక్రోషం, ఓటమి భారంతో పళ్ళు నూరాడు. 'గెలిచానని సంబర పడకు...' అంటూ మాధవి వైపు క్రూరంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

'మహిలో...ఓ మహిళా.../మార్పు కోరింది చైతన్యశక్తిలా...' దూరంగా ప్రజా గాయకులు పాటందుకున్నారు. అకాశం ఎర్రబడింది...మార్పును కోరుతూ మాధవి కోర్టు నుండి బయటకు అడుగులేస్తూ...

(విద్యా కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ)

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణా మాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతి-శీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధా న్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగిం చినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక,హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

<u>మెయిల్ అడ్రస్:</u>

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

పాప్రి చాట్

కావాల్సినవి

బియ్యప్పిండి: రెండు కప్పులు
మైదా: నాలుగు కప్పులు
పెరుగు: ఆరు కప్పులు
ఉడికించిన బంగాళాదుంపలు (మీడియం సైజువి): నాలుగు, కారం: నాలుగు టీ స్పూన్లు
పసుపు: టీ స్పూను
జీలకర్ర పొడి: రెండు టీ స్పూన్లు
షాజీరా పొడి: రెండు టీ స్పూన్లు
కొత్తిమీర: కట్ట, కొబ్బరితురుము: కప్పు
చాట్ మసాలా: టీ స్పూను
రెడ్ చట్నీ: ఆరు టీ స్పూన్లు
ఉప్పు: సరిపడా
కరివేపాకు: కొద్దిగా
నూనె: సరిపడా

తయారీ

బియ్యప్పిండి మైదా, షాజీరాపొడి, జీలకర్ర పొడి, కారం, పసుపు, అన్నీ కలపాలి. ఈ మిశ్రమంలో తగినన్ని నీళ్లు పోసి గట్టి పిండిలా కలపాలి.పిండిని పూరీల్లా ఒత్తుకుని వేయించి తీసి ముక్కలుగా చిదమాలి. ఓ గిన్నెలో పెరుగు వేసి స్పూనుతో మృదువుగా కలపాలి. స్టవ్ మీద బాణలి పెట్టి టీ స్పూను నూనె వేసి జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వేసి రెండు నిమిషాలు వేయించాలి. దించాక పెరుగు వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి.రెడ్ చట్నీ రెడీగా ఉంచుకోవాలి. విడిగా మరో గిన్నెలో ఉడికించిన బంగాళాదుంపల ముక్కల్లో చాట్ మసాలా వేసి చిదిమినట్లుగా కలిపి ఉంచాలి.

ఓ ప్లేటులో చిదిమిన పూరీలను కొన్ని పెట్టి వాటిమీద టేబుల్ స్పూను చిదిమిన బంగాళాదుంపల్ని వేయాలి. నాలుగు టేబుల్ స్పూన్ల పెరుగు వేయాలి. ఆ పైన టీ స్పూను రెడ్ చట్నీ వేసి చాట్ మసాలా కొత్తిమీర తురుము చల్లి అందించాలి.

మైదా కప్పులు

కావాల్సినవి

మైదా 1- కప్పు
బియ్యప్పిండి - అరకప్పు
వేయించిన సెనగపప్పు - అరకప్పు
కారప్పూస -పావుకప్పు
వేయించిన వేరుసెనగ పప్పు - పావుకప్పు
చాట్ మసాలా -చెంచా
ఉల్లి తరుగు-అరకప్పు
పుదీనా తరుగు -కొద్దిగా
కరివేపాకు -రెండు రెమ్మలు
కొత్తిమీర తరుగు-1 కప్పు
నిమ్మరసం-రెండు చెంచాలు
నూనె-వేయించడానికి సరిపడా
ఉప్పు- తగినంత

తయారు చేసేవిధానం

ఓ గిన్నెలో మైదా, బియ్యపిండిని తీసుకుని చపాతీ పిండిలా కలిపి పెట్టుకోవాలి. ఈ పిండిని పూరీల్లా చేసుకుని చిన్న గిన్నెకు వెనుకవైపు అద్దాలి. పొయ్యి వెలిగించి బాణలిలో నూనె వేడిచేసి గిన్నెను నేరుగా అందులో ఉంచాలి. పూరీ వేగాక గిన్నె నుంచి వేరవుతుంది. బంగారు వర్ణంలోకి వచ్చాక దింపేయాలి. మిగిలిన పిండినీ ఇలాగే చేసుకోవాలి. మరో గిన్నెలో మిగిలిన పదార్థాలన్నీ కలిపి ఈ కప్పుల్లో నిలిపితే చాలు. ఈ మైదా కప్పుల్ని పిల్లలు ఇష్టంగా తింటారు.

పనీర్ టిక్కా

కావలసినవి

శనగ పప్పు -అర కప్పు (వండే ముందు రెండుగంటలు నానబెట్టుకోవాలి)
పనీర్-500 గ్రాములు
ఎండు మిర్చి-ఐదు
చాట్ మసాలా-2 టీ స్పూన్లు
అల్లం-చిన్న ముక్క
వెల్లుల్లి -నాలుగైదు రేకులు
పచ్చిమిర్చి -5, బంగాళాదుంపలు-నాలుగు
కార్న్‌ఫ్లోర్ -పావు టీ స్పూన్

తయారుచేసే విధానం

బాణలిలో నూనె పోసి వేడి చేయాలి. అల్లం, పచ్చి మిరప కాయలు సన్నగా తరిగిన ముక్కలు వేసి వేడిచేయాలి. శనగపప్పు, ఎండు మిరపకాయలు, చాట్ మసాలా, ఉప్పు వేసి, శనగపప్పు వేగే వరకు వేయించాలి. ఇప్పుడు పనీర్ వేయాలి. ఉడికించిన బంగాళా దుంపలను చిదిమి కలపాలి. ఈ మిశ్రమాన్ని కొంచెం చేతిలోకి తీసుకుని టిక్కా ఆకారంలో మలిచి ఒక్కొక్కటిగా కార్న్‌ఫ్లోర్‌లో కోయాలి. టిక్కా మొత్తం ఫ్లోర్ పట్టించాలి. వీటిని కాగిన నూనెలో వేసి ఎర్రగా వచ్చే వరకు వేయించాలి. పైన చెప్పిన కొలతల ప్రకారం తీసుకుంటే పన్నెండు లేదా పదమూడు టిక్కాలు చేయవచ్చు.ఈ పనీర్ టిక్కాని చట్నీతో తినొచ్చు.

గోధుమపిండి బిస్కట్స్

కావలసినవి

గోధుమ పిండి	- 3 కప్పులు
నెయ్యి	- అర కప్పు
కారం	- 4 చెంచాలు
ఉప్పు	- తగినంత
జీలకర్ర పొడి	- 2 చెంచాలు
నూనె	- 250 గ్రాములు

తయారుచేసే విధానం:

ముందుగా గోధుమ పిండిని బాగా జల్లించి అందులో ఉప్పు, కారం, జీలకర్ర పొడి బాగా కాచిన నెయ్యి వెయ్యాలి. కొంచెం నీళ్ల పోసి చపాతీ పిండిలా గట్టిగా కలిపి ఒక గంట నాననివ్వాలి. తరువాత చిన్నచిన్న ఉండలుగా చేసి వాటిని చపాతీలాగా వత్తాలి. దాని మీద చాకుతో చిన్న చిన్న డైమండ్ ఆకారంలో లేదా మనకు నచ్చిన అకారంలో కట్ చేసి పక్కన పెట్టుకోవాలి. స్టౌ వెలిగించి ఒక పాత్రలో నూనె వేసి బాగా కాగిన తరువాత కట్ చేసి పెట్టుకున్న ముక్కలను అందులో వేసి నెమ్మదిగా వేయించాలి. ఎరుపు రంగు వచ్చాక తీసేయాలి. ఇవి తినటానికి ఎంతో రుచిగా, వెరైటీగా ఉంటాయి. టీ టైమ్‌లో సర్వ్ చేయడానికి వీటిని డబ్బాలో మూత పెట్టి ఉంచితే చాలా బావుంటాయి.



బొమ్మ వేద్దామా

ఆర్టిస్టు అంకుల్ ఈ వారం చిలుక బొమ్మను ఏలా వేయాలో నేర్పిస్తాడు. అల్లరి చేయకుండా నేర్చుకోండే..



అతికించండి

చింటూ కప్ప బొమ్మను కత్తిరించి వాటిని అతికించడం ఎలానో మరిచిపోయాడు. చింటూ కన్నా బాగా అతికిస్తారు కదూ.



ఇదేదో తేడాగా వుందే...

ఇక్కడ ధృవపు ఎలుగు బంటి (పోలార్ బేర్) జంతువులు గుంపులుగా ఉన్నాయి. చూడ్డానికి అన్నీ ఒకేలా ఉన్నా ఒకటి తేడాగా ఉంది. వాటిని కనుగొనండి.



రంగులేద్దాం

ఈ చిట్టి బాలుడు తమ పరిసరాలను శుభ్రం చేసుకుంటున్నాడు. వాడికి రంగులేసి అందంగా తీర్చిదిద్దుతారా!

పదాలు ఎక్కడున్నాయి?

నీటి కుండలో చాలా పదాలు దాగున్నాయి.అయితే వీటిలో 15 పదాలు దాగి ఉన్నాయి. మీరేం చేయాలంటే...అడ్డంగా, నిలువుగా, వంకరగా ఎలా దాక్కున్నా..వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.



ఎక్కడ దాక్కున్నాయో

ఒక పార్క్‌లో రెండు జంతువులు కలిసి మాట్లాడుతూ ఉన్నాయి కదూ. ఈ చిత్రంలో చాలా వస్తువులు దాగున్నాయి వాటిని గుర్తించండి.



హమ్మింగ్ రెక్కల పురుగు

అరే హమ్మింగ్ బర్డ్ అనేయకండి పిల్లలూ. సరిగ్గా చూడండి. అది పక్షి కాదు. అదో మోత్. అదే పురుగు నుంచి సీతాకోకచిలుక వచ్చినట్లు ఈ రెక్కల పురుగులు వస్తాయి. వీటి పేరు హమ్మింగ్ బర్డ్ హాక్ మోత్. చూడ్డానికే కాదు అచ్చు హమ్మింగ్ బర్డ్‌లాగే ఇవి వేగంగా రెక్కలాడిస్తూ కదలకుండా గాల్లో ఉండి పూల తేనెను స్వీకరిస్తాయి. అప్పుడు వాటి రెక్కలు చేసే చప్పుడును మనం స్పష్టంగా వినొచ్చు. పొడవాటి వాటి నాళికలు ట్యూబ్ ఆకారంలో ఉండే పూలలోని మకరందాన్ని సైతం జుర్రేయగలవు. భలే తమాషాగా ఉందే అనుకుంటున్నారా. అయితే మరిన్ని సంగతులు తెలుసుకోండి.

- ❑ వీటి దగ్గరి బంధువులైన బీ మోత్, హమ్మింగ్‌బర్డ్ మోత్‌లు కూడా చూడ్డానికి ఒకేలా ఉంటాయి.
- ❑ ఇవి ఎక్కువగా బ్రిటన్‌లో కనిపిస్తాయి. ఎందుకంటే అక్కడి వేసవి కల్లా ఉత్తర ఆఫ్రికా, దక్షిణ యూరప్ దేశాల నుంచి తరలిపోతాయి.
- ❑ వర్షంలోను రెక్కలాడిస్తూ మకరందాన్ని వెతికే ఇవి వేసవిలో భగ్గున మండే 45 డిగ్రీల వేడిలోను హాయిగా తిరిగేయగలవు.
- ❑ కానీ చలికి తట్టుకోలేవు. అందుకే వందల మైళ్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు వలసపోతాయి. ఏంటి చిన్ని రెక్క పురుగులు కూడా అంత దూరం వలసపోతాయా అని ఆశ్చర్యంగా ఉంది కదా.
- ❑ ఆ సమయంలో అవి చెట్లు, బిల్డింగ్‌లు, రాళ్ల మధ్య ఉన్న పగుళ్లలో చేరి చలికాచుకుంటాయి.
- ❑ వీటికి రంగు రంగుల పూలంటే బోలెడు ఇష్టం. రంగుల్లో చిన్న తేడాను కూడా ఇట్టే పట్టేయగలవని తేలింది.
- ❑ బాగా పసందుగా అనిపించిన పూల మొక్కల దారిని గుర్తు పెట్టుకుని మళ్లీ మళ్లీ వెళ్లి తేనె లాగించేస్తాయి. వేల మొక్కల్లోనైనా వీటిని తేలిగ్గా గుర్తుపట్టేస్తాయి.
- ❑ వీటి రెక్కలు సుమారు 50-58 మిల్లీమీటర్ల బారు ఉంటాయి.
- ❑ ఇవి బొజ్జుగా బూడిద రంగులో ఉంటాయి. వాటి రెక్కలపై నల్లటి చారలుంటాయి. వీటికి వెనుక రెక్కలు కూడా ఉంటాయి. అవి ఎగిరినపుడు స్పష్టంగా కనిపిస్తాయి. లేత బంగారు-నారింజ రంగుల్లో ఉండటంతో ఎంతో ముచ్చటగా అనిపిస్తాయి.



- ❑ వీటి గుడ్లు పుప్పొడిలా ఉంటాయి. ఒక తడవకు 2 వందల గుడ్లు పెట్టే ఆడ మోత్‌లు ఒక్కో పువ్వుపై ఒక్కో గుడ్డును జారవిడుస్తుంది.
- ❑ ఆరు నుంచి ఎనిమిది రోజుల్లో లార్వా బయటకు వస్తుంది.
- ❑ లార్వా దశలో ఉన్నపుడు ఇవి పచ్చటి పురుగులుగా ఉంటాయి. వీటి వెనుక ఒక ముళ్లు ఉంటుంది. శరీరంపై రెండు నల్లటి చారలు ఉంటాయి.
- ❑ పూల గడ్డిని తిని పెరిగే ఇవి 20 రోజుల తర్వాత ప్యూపా దశకు చేరుకుని మొక్కల అడుగు భాగంలో గూడు కట్టుకుంటాయి.
- ❑ వేసవి కాలానికి గూడు నుంచి బయటిపడి రెక్కలతో చక్కర్లు కొట్టడం మొదలెట్టేస్తాయి.
- ❑ ఇటలీ, మాల్టా దేశాల్లో ఇవి కనిపిస్తే మంచి సూచికగా భావిస్తారు.

నల్ల చేపపిల్ల కథ

చైతన్య ప్రవాహంలో ఈదులాడే ఓ చిన్న 'నల్ల చేపపిల్ల' కథ ఇది. ప్రపంచం అంచుల్ని చుంబించాలనే తపన. నూతన ప్రపంచంలో ఆవిష్కృతం కావాలనే తిరుగులేని పట్టుదల. ఆ అద్భుత ప్రయత్నంలో చేప పిల్ల పొందిన ఎన్నో వింత వింత అనుభవాలు, ప్రకృతి విజ్ఞాన పారవశ్యాలు, విరుచుకుపడ్డ ప్రమాదాలు, వాటితో చెలగాటాలు ఎవరెవరితోనో పరిచయాలు. శత్రు మిత్ర భావనలు, అననుకూల పరిస్థితులు శత్రువుపై పన్నిన యుద్ధ వ్యూహాలు మొక్కవోని ధైర్య సాహసాలతో ముందుకు మున్ముందుకు సాగించిన స్వేచ్ఛా ప్రయాణం. అదో భయమెరుగని జీవన గమనం. నిజంగా ఇది

నల్ల చేపపిల్ల కథ
సమద్ బెహరంఘీ,
వెల: 20/-,
పేజీలు: 30,
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు, ఫోన్: 0866-24 30 302

కేవలం చేపపిల్ల కథేనా! అవును నిజమే బెహరంగీ అల్లిన మరో 'పంచతంత్ర' కథ. ఇది మనిషి స్వేచ్ఛా పిపాసకు, జ్ఞాన తృష్ణకు ఎత్తిపట్టిన ప్రతీక. తన జాతిజనులలో ఇంకా చెప్పాలంటే ప్రపంచ మానవాళిలో స్వాతంత్ర్యేచ్ఛని. అందుకవసరమైన చైతన్యాన్ని రగుల్గొలిపేందుకు సమద్ బెహరంగీ చేసిన అద్భుత సృజన 'నల్ల చేప పిల్ల కథ'. బెహరంగి ఉపాధ్యాయుడు, సామాజిక విమర్శకుడు, ప్రజా రచయిత, చిన్న చిన్న కథలు రాయడంలో అందేవేసిన చెయ్యి తన ఆప్తమిత్రుడు 'బెహ్రూజ్ డెఘనితో' కలిసి జానపద సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేశారు. అజర్ బైజానీ మౌఖిక సాహిత్యానికి సంబంధించిన ఎన్నో కథలను సేకరించి ప్రచురించారు. పర్షియన్ భాషలోని సుప్రసిద్ధ కవులు అహ్మద్ షమ్లోవ్, ఫరూఖ్ ఫర్రొఖజద్. మెహిది అఖవన్- సాలెస్ పద్య కావ్యాలను అజరీ భాషలోనికి అనువదించారు. బెహరంగి సాహితీ సరోవరంలో వికసించిన ఈ మనోహరమైన చిన్న కథా సుమాన్ని అనుపమ తెలుగులోకి అనువదించగా విశాలాంధ్ర ప్రచురణాలయం అందిస్తోంది.

ఎందుకు? ఏమిటి? ఏది? ఎలా?

ప్రశ్నించేవాడు అప్పటికే అజ్ఞాని! ప్రశ్నించనివాడు ఎప్పటికీ అజ్ఞానే!! అన్నది లోకోక్తి. ఆకాశం నీలంగా వుంటుంది ఎందుకు? అత్యంత వేగంగా ప్రయాణించే పక్షి ఏది? ఐస్ ఎలా ఏర్పడుతుంది? అతి సూక్ష్మ జంతువులు ఏవి? యిలా ఎందుకు? ఏమిటి? ఏది? ఎలా? అనే ప్రశ్నలతో పిల్లలు, యువకులు ఇంట్లో పెద్దవాళ్ళు, తల్లిదండ్రులను , స్కూల్లో ఉపాధ్యాయులను అడుగుతూనే ఉంటారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి తెలిసినవి చెప్పి తెలియని వాటిని తెలుసుకొని పిల్లలకు చెప్పక ప్రశ్నించే వాడిని 'వీడొక సందేహాల పుట్ట' అని, ప్రశ్నించే అమ్మాయిని ఇదొక 'పెద్ద కొశ్చన్ బ్యాంకు! దీనికి అన్నీ సందేహాలే' అని అంటుంటారు. ఇదిగో సరిగ్గా అలాంటి వారికోసమే ఇందులో నిత్యం ఎంతో మందికి వచ్చే సందేహాలకు 400 ప్రశ్నలు- సమాధానాలు సేకరించి ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఇందులో జీవశాస్త్రం, భౌతిక, భూగోళ శాస్త్రాలు, శరీర - వైద్యం- సైన్స్, టెక్నాలజీ, చరిత్ర, జనరల్ నాలెడ్జ్‌లలో వచ్చే సందేహాలకు సమాధానాలున్నాయి. అక్కడక్కడ బొమ్మలను కూడా చేర్చారు. కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇది, అదా అనే సందిగ్ధం వుంటే వాటికి జవాబులు ఈ పుస్తకంలో లభిస్తాయి. మొత్తంమీద ఈ పుస్తకం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, యువతకు క్విజ్‌లలో పాల్గొనే వారికి వారి ఐ.క్యూ. ను పెంచడానికి ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు.

ఎందుకు? ఏమిటి? ఏది? ఎలా?,
సంకలనం,
సంపాదకుడు: పి.రాజేశ్వరరావు,
రచనా సహకారం : సుబ్బారావు మక్కెన, పేజీలు: 140, ధర: రు. 120,
ప్రతులకు: నవ చేతన, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు, ప్రముఖ పుస్తక విక్రేతలు.



\- స్నేహ

సైన్స్ విజయాలు

కోతి ఆకారాన్ని పోలిన ఆదిమ మానవుడు వాటి నుండి రూపాంతరం చెందడానికి పరిశీలనే కారణం. ఈ పరిశీలనే పరిశోధనలకు నాంది పలికింది. పరిశోధనల రూపంలో మనిషి విజ్ఞానాన్ని పెంచుకున్నాడు. కొత్త ఆవిష్కరణలతో నాగరికత వైపు అడుగులు వేశాడు. నిప్పు, చక్రం, పాదరక్షలు... నాగరికత నేర్చిన కట్టు, బొట్టు, ఆభరణాలు ఇలా మొదలైన సైన్స్ ఆవిష్కరణల ప్రస్థానం పేపర్, ప్రింటింగ్ మెషీన్, భాష, రాసే పెన్ను, సన్ డయల్, శుభ్రత నిచ్చే సబ్బులు, కత్తెర, ఉపాధినిచ్చిన టైప్ రైటర్, గడియారం.... కాఫీ, టీ మిషన్, ఇలా ఎన్నో... ఈ భూమి మీద మానవుడి మనుగడ వున్నంత కాలం ఈ ఆవిష్కరణలు కొనసాగుతూనే ఉంటాయి. సైన్స్ ఆవిష్కరణలతో మానవుడు కొత్త రూపు దాల్చాడు. సౌకర్యవంతంగా జీవించేందుకు, పనిలో శ్రమ శాతాన్ని తగ్గించుకునేందుకు ఎలివేటర్(లిఫ్ట్), ఎస్కలేటర్, సీడ్ డ్రిల్‌ను అవిష్కరించాడు. ఏ మాత్రం సాంకేతిక పరిజ్ఞానం లేని వందల సంవత్సరాల క్రితమే ఈజిప్టులో పిరమిడ్లు ఏర్పడ్డాయి. ఈజిప్టులో పిరమిడ్లు ఒక వింతయితే పెద్దపెద్ద క్రేన్‌లు లేని ఆ రోజుల్లో సముద్ర రవాణా ఓడ ప్రయాణాలు వంటివన్నీ ఆసక్తి కలిగించే అంశాలే. ఇలా పలువురు శాస్త్రవేత్తలు రూపొందించిన పరికరాలు, వాటి కాలాలు, తదితర విషయాల గురించి జె.ఎస్.ప్రభాకర్ క్లుప్తంగా 'సైన్స్ విజయాలు'లో అందించారు. ఇన్ని రకాల ఆవిష్కరణలకు సంబంధించిన విశేషాలను ఒక దగ్గర చదివే అవకాశాన్ని కల్పించిన ప్రచురణకర్తలకు అభినందనలు.

సైన్స్ విజయాలు, జె.ఎస్.భాస్కర్,
వెల: రు.75/-
పేజీలు: 98/-
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, ఫోన్: 0866-2430302.



వేస్ట్ నుంచి వెరైటీగా..

రోడ్డు పక్కనో... బీచ్ ఒడ్డునో ... నడుస్తూ వుంటాం. ఏవేవో పనికి రాని వస్తువులు కనిపిస్తుంటాయి. చాలామందికి లాగే మనమూ వాటిని చూసీచూడనట్టు వెళ్లిపోతుంటాం. అయితే జాన్ కెనడీ బ్రౌన్ అలా కాదు. పనికి రాని చెత్తను సైతం కళాత్మకంగా చూశాడు. వాటిని సేకరించి తనకు తెలిసిన వెల్డింగ్ విద్యతో కళాఖండాలను సృజించాడు. వెస్ట్ వేల్స్‌కి చెందిన బ్రౌన్ ... ఆర్ట్స్ స్కూల్లో చదువుకున్నాడు. అయితే డిగ్రీ మాత్రం పూర్తి చేయకుండానే ఆగిపోయాడు. ఆ తర్వాత అతను నేర్చుకున్న వెల్డింగ్ పని ఎంతో అక్కరకొచ్చింది. తను సేకరించిన ఇనుప వస్తువులను ఉపయోగించి అనేక జంతువులను తయారుచేశాడు. ఆన్‌లైన్లో వాటికి చెప్పలేనంత స్పందన లభించింది. దాంతో అదే అతని పూర్తి కాలపు పనైపోయింది. వేల్స్‌లో ఏళ్ల తరబడి తను పరిశీలించిన కీటకాలు, పక్షులు, కప్పలు, వంటి వన్యప్రాణులకు ఇనుప వస్తువులతో ప్రాణం పోశాడు. అడపాదడపా అతను నిర్వహించే ఎగ్జిబిషన్లకు మంచి ఆదరణ లభిస్తోంది. వాటిలో రంగురంగుల సీతాకోకచిలుకలు, కట్లపాముకైతే మరీను. మనసుతో చేసిన పనేదైనా అంతే. పలువురి ప్రశంసలు తప్పక పొందుతుంది. ★

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు...

అభివృద్ధిని కాంక్షించే లక్షలాది మంది రైతులు మాతోపాటే గర్వకారణమైన ఈ మధురక్షణాలను పంచుకొనుచున్నారు.

ప్రపంచములో పేరెన్నికగన్న వ్యాపార సంబంధిత పత్రిక వెలువరించిన మొట్టమొదటి వ్యాపార సంస్థలశ్రేణీకరణ ప్రకటన

ప్రపంచాన్ని మార్చండి

ప్రపంచములోని సాంఘిక మరియు పర్యావరణ స్థితిగతుల గురించి 51 కంపెనీలను క్రోడీకరించి

వెలువరించిన పత్రిక -- భారతదేశము నుండి ప్రపంచములో 7వ ర్యాంకుకు ఎన్నికైన ఏకైక కంపెనీ

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్ మాత్రమే



జైన్ ఇరిగేషన్ కంపెనీ తన కంపెనీ వ్యాపార పునాదులను భారతదేశములోని దాదాపు 5 లక్షలమందికి జీవనాధారమైన వ్యవసాయములో ఎన్నో అభివృద్ధి పనులను పరిచయము చేసినది. 1986లో సూక్ష్మనీటి పారుదల సిస్టంలను అమ్మటం ప్రారంభించింది. చిన్న కమతాలు కల రైతాంగము సేద్యములో పురాతన పద్ధతులైన వాననీటితోగాని లేక వరదగా పారించుట వంటి జైన్ ఇరిగేషన్ ప్రవేశ పెట్టిన సూక్ష్మనీటి పారుదల పద్ధతి సరిగ్గా సరిపోవునని నిరూపించినారు. జైన్ సంస్థ నమ్మే సిద్ధాంతమైన 'తక్కువ నీటితో ఎక్కువ పంటలు' అనే నినాదముతో తాము ధృవీకరించిన ఫలితాలు రావటం, దిగుబడులు అధికంగా పొందటానికి దోహదముచేసి 50% నుండి 300% రైతాంగపు ఆదాయములో వృద్ధికనపడింది. దీనిని ఊతంగా తీసుకొని ఇంకా అధికఫలితాలు సాధించటానికి శ్రమించుతుంది. దానికి ఉదాహరణలుగా గిట్టుబాటు పంటరకాలు, రైతులకు నవీనసేద్య పద్ధతుల శిక్షణలు, పంట దిగు బడుల గణనీయ పెంపుదలకు దోహదముచేయు విప్లవాత్మక పంట పండించు విధానములు అనగా అత్యధిక సాంద్రతలో మామిడి పంటలో మొక్కలు పెంచటం. అంతియేకాక వ్యవసాయమునకు నాడీమండలములాంటి సౌరశక్తితో విద్యుత్ సరఫరాచేసి సాగునీరు అందించును. వ్యవసాయ పెట్టుబడులకు ఆర్థిక సహాయము, అవసరమైన ఆహార పంటల ప్రాసెసింగ్ చేయుటవలన కలుగు మార్కెట్ విస్తరణ చేపట్టుచున్నది.

పార్చ్యూన్. కామ్, సెప్టెంబరు1, 2015

ఉత్తేజపరచు, వినమ్ర క్షణాలలో సాగిపోవుచు, ఆగకుండా ముందుకు సాగుచున్న, వర్ధిల్లచేయు సుదీర్ఘ ప్రయాణములు.

మంచిపనులు చేయుచు, మంచిగా బ్రతుకుట.

పార్చ్యూన్

జైన్®

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, గాంధీనగర్, హైదరాబాద్ - 80,
ఫోన్ : 040-2761 4474, 24654681, 9440797846.
Email : jainhyderabad@jains.com,
Website : www.jains.com



మంచు కురిసే వేళలో..

మంచు కురిసే వేళలో హిమ స్ఫటికాల్ని పోతపోసుకుని నియాన్ కాంతుల్ని పూత పూసుకుని ప్రాణం పోసుకుంటుంది హోటల్ డి గ్లాసె. కేవలం మంచు గడ్డలతో ఈ హోటల్‌ను ఏటా చలికాలంలో వివిధ థీమ్స్‌లో ఎప్పటికప్పుడు కడతారు. కెనెడాలోని క్యుబెక్‌కు సమీపంలో గడ్డకట్టిన ఈ అందంలో విడిది చేసేందుకు ఇప్పటికే క్యూ కట్టేశారు. 2001లో ప్రారంభించిన ఈ హోటల్‌కు ఇది 16వ సీజన్. ఈ సారి నదుల్ని థీమ్‌గా ఎంచుకున్నాడు కళా దర్శకుడు పియెర్రె ఎల్‌హ్యారీక్స్. నవంబర్, డిసెంబర్‌లలో భావి మంచు ఆర్కిటెక్ట్స్‌కు అవకాశం కలిపిస్తూ కాన్సెప్ట్ పోటీల్ని నిర్వహించారు. వీటికి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల ఆర్కిటెక్చర్ విద్యార్థులు హాజరయ్యారు. ఒక్కొక్కరూ ఒక్కో థీమ్ స్యూట్‌కు రూపకల్పన చేశారు.

★



Check List			
Book Number	KNSR02B102	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mounika
Scanned By	shameera	Pages	29